సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 3-11-2023 15/-

## యుద్ధబీభత్సంలో విద్వేష రాజకీయం








గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి 45 సంచిక: 44 హైదరాబాద్
శుక్రవారం 3 నవంబర్ 2023 రూ.15-00
18 రబీ ఉల్ ఆఖిర్ 1445 హిజ్రీ

**తొలిగీటు**

జనులారా! అల్లాహ్‌ను మీ తప్పులకు క్షమాపణకూ వేడుకోండి. ఆయన వైపు మరలండి. నేనయితే రోజుకు వందేసి మార్లు క్షమాపణకై అర్థిస్తూ ఉంటాను.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**


**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




## లోపల...

| | | |
|---|---|---|
| చైతన్యవంతులు | ...... | 04 |
| యుద్ధబీభత్సంలో విద్వేష రాజకీయం | ...... | 05 |
| చరితార్థులు-2 : పఠాన్ తుర్రెబాజ్ ఖాన్ | ...... | 11 |
| నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)- 3 | ...... | 12 |
| మాటలకే పరిమితమైన మైనార్టీల సంక్షేమం | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| గాఢాంధకారం - 3 | ...... | 21 |
| ఇస్లామ్ : ఒక చూపులో! | ...... | 24 |
| ఆరోగ్యమే మహాభాగ్యం | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |

## తిరుగుటపా....



కాషాయం విప్పాడట
రాజగోపాల్ రెడ్డి
ఇన్నాళ్ళు మోసిమోసి
తడిసినదట చెడ్డి!

ఏమైందో ఏమోమరి
భా.జ.పాతో డీలు
ఆర్నెల్ల లోపులోనె
బెణికినదట కీలు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఆలోచన

# చైతన్యవంతులు

**దేశంలో నేడు** నెలకొని ఉన్న పరిస్థితుల్ని పరిశీలిస్తే అనేక రకాలుగా నిరాశే ఎదురవుతుంది. సాంకేతిక పరిజ్ఞానం ఎంతో పెరిగింది. పారిశ్రామిక రంగం ఎంతో ప్రగతి సాధించింది. ఉత్పాదన ఎన్నో రెట్లు అధికమయింది, విద్యా వైజ్ఞానిక క్షేత్రాల్లోనూ గణనీయమయిన అభివృద్ధిని గడించాము. అయినప్పటికీ దేశాధ్యక్షుడు చేసే ప్రకటనలు మొదలుకొని సాధారణ విషయ పరిజ్ఞానమున్న ఏ వ్యక్తినయినా కదిలిస్తే ఇట్టే చెప్పి చెయ్యగలిగే సమీక్షల వరకు సర్వత్రా వినవచ్చే విచార వచనం ఒక్కటే – అట్టడుగు మనిషి వరకు ప్రగతి ఫలాలు చేరడంలో ఎన్నో అడ్డంకులు ఎదురవుతున్నాయి, దేశ ప్రజలు అధికాంశం ఇంకా దారిద్ర్యరేఖకు దిగువనే కాలం వెళ్ళదీస్తున్నారు, సామాన్య హక్కులేవయినాసరే అన్ని వర్గాల ప్రజలకు అందడంలో ఎనలేని జాప్యం జరుగుతోందనీను.

అయితే మనం సాధించిన ఇన్ని ప్రగతులు, వృద్ధీ వికాసాలూ, ఎటు పోతున్నట్లు, ఎక్కడ ప్రోగవుతున్నట్లు? దీన్ని ఆరా తీయడానికి పెద్ద విచారణ సంఘాలు, నివేదికలూ గట్రా అవసరం లేదు. అతి సాధారణ పరిశీలన వల్లనే అవగతమయ్యే అతి సామాన్య యదార్థం. మన జీవితాల్లో– వ్యక్తిగత రంగాల్లోనూ సామూహిక క్షేత్రాల్లోనూ – మానవతకు జీవగర్ర అయిన విలువలు నేడు పూజ్యమయ్యాయి. మానవీయ ప్రమాణాలన్నీ సెలవుదీసుకు కానరాని దూరాలకు చేరుకున్నాయి. వాటి స్థానే స్వార్థ ప్రియత్వం, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం సన్నిహితమయి ప్రముఖ స్థానం ఆక్రమించుకున్నాయి. ముఖ్యంగా రాజకీయాల్లో సేవాభావం అసలెక్కడా కాన రావడంలేదు. ఎక్కడయినా 'కాన' వచ్చినా అది చూపువరకే పరిమితమయి పోయింది. చివరికి ఉన్నత రాజకీయ స్థానాల్లో ఉన్న పెద్ద మనుషుల విశ్వసనీయత పట్ల కూడా సందేహాలు, సంశయాలు జనించే దురదృష్టకరమయిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక ఎవరిని నమ్మడం? అని నిలదీస్తున్నాడు సామాన్యుడు.

ఈ నేపథ్యంలో, జనజీవనంలో సామాన్య న్యాయం, సామరస్యం, సౌభ్రాత్రం, సమత్వం, సామాజిక, ఆర్థిక న్యాయం లాంటి విలువలు పెరిగి పరిఢవిల్లే వాతావరణం నెలకొనడం సాధ్యమయ్యే పనేనా? వీటికి సంబంధించిన ప్రకటనలు, ప్రవచనాలు, భాషణలు, ఉద్ఘోషణలు ఎన్ని వినవచ్చినా ప్రజలకు అవి ప్రాప్తమవడం కుందేటి కొమ్ములా పరిణమించిందన్నది మటుకు యథార్థం.

పడిపోయిన విలువల కోసం కాదు, ప్రాప్తం కాని హక్కుల కోసం ఏ కాస్త గొంతెత్తినా, ఏమాత్రం కదలి ముందుకు వచ్చినా, కనీవినీ ఎరుగని సరికొత్త పోకడలతో నిరంకుశ, నియంతృత్వపు ఉక్కు పాదాలు ప్రజాస్వామ్యపు ముసుగులో ఎదురవుతున్నాయి. కల్పించిన కేసులతో, చట్టాల రోమ చ్ఛేదనలతో వేధింపులు సాగుతున్నాయి. వార్తాపత్రికలు, ఇతర ప్రచార సాధనాలపై కాగితపు ధరల పెంపుదల వంటి అనేక ఇబ్బందుల పర్వతాలు విరుచుకుపడుతున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఆత్యయిక పరిస్థితి లాంటి చీకటి తెర పడదన్న నమ్మకమేమిటి?

పరిస్థితుల ఈ స్వరూపంలో అణుమాత్రపు మార్పు రావాలన్నా రాజకీయ పక్షాలకు, ముఖ్యంగా పాలక పక్షానికి గుణపాఠం గరిపేందుకు ప్రజలు సన్నద్ధమవ్వాలి. ప్రజలు తమకున్న ఓటు బలాన్ని సక్రమంగా వినియోగించి సమాజంలో ఉత్తమ మానవ ప్రమాణాలకు విలువనిచ్చేవారిని, సమత్వం, సామాజిక న్యాయం ఇత్యాది మూల్యాల ప్రాముఖ్యాన్ని గుర్తెరిగినవారిని, ఎట్టి పరిస్థితిలోనూ నిరంకుశ నియంతృత్వ ధోరణులను ప్రతిఘటించే వారిని, సాంస్కృతిక ఉగ్రవాదానికి ముకుతాడు వేసే వారిని తమ ప్రతినిధులుగా ఎన్నుకునేందుకు వారిని, సచేతనులుగా చెయ్యడం ఒక్కటే నేడు చైతన్యం అనిపించుకుంటుంది. మరి మనం చేతనావస్థలో ఉన్నామని నిరూపించుకోగలమా?

ఎస్.ఎమ్. మలిక్

అబ్దుల్ వాహెద్

# యుద్ధబీభత్సంలో విద్వేష రాజకీయం



**ఈ నెల** 16వ తేదీ నుంచి హమాస్, ఇస్రాయీల్ మధ్య ప్రారంభమైన యుద్ధం మరింత భీకరంగా మారింది. అంతర్జాతీయంగా తీవ్రస్థాయి ఆందోళనల వ్యక్తమవుతోంది. పాలస్తీనా ప్రాంతాలపై ఇస్రాయీల్ కొనసాగిస్తూ వస్తున్న దౌర్జన్యాల దశాబ్దాల చరిత్ర అందరికీ తెలిసిందే. ఇస్రాయీల్‌పై హమాస్ చేసిన మెరుపు దాడితో ఇస్రాయీల్ గూఢచార వ్యవస్థ, ఇస్రాయీల్ రక్షణ వ్యవస్థలు బిత్తరపోయాయి. ఆ తర్వాతి నుంచి ఇస్రాయీల్ గాజాపై వరుసగా వైమానిక దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో ఇరువైపులా సాధారణ ప్రజలు అనేకమంది మరణించారు. మరీ ముఖ్యంగా గమనించవలసింది, గాజాలో నిత్యావసర వస్తువులు, ఆహారం, మంచినీరు, కరెంటు సరఫరా అన్నింటినీ ఇస్రాయీల్ అడ్డుకోవడం వల్ల తీవ్రమైన మానవవీయ సంక్షోభం నెలకొంది. అక్టోబర్ 16వ తేదీన గాజాపై ఇస్రాయీల్ వైమానిక దాడులు ప్రారంభించింది. అత్యంత భయంకరమైన ఈ దాడుల్లో అనేక మంది సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. సాధారణ ప్రజల భద్రతను ఏమాత్రం పట్టించుకోకుండా ఇస్రాయీల్ చేసిన దాడుల్లో అమాయక ప్రజలు పిల్లలు మహిళలు చనిపోవడాన్ని ప్రపంచం నిరసించింది. ఆ వెంటనే ఇరాన్ నుంచి హెచ్చరిక వచ్చింది. గాజా జనావాసాలపై ఇస్రాయీల్ దాడులను తక్షణం ఆపేయాలని ఈరాన్ చేసిన హెచ్చరిక ఈ ప్రాంతంలో యుద్ధం మరింత విస్తరించే ప్రమాదాన్ని సూచిస్తోంది. మరోవైపు ఇస్రాయీల్ భారీస్థాయిలో ట్యాంకులను గాజా వద్ద మోహరించింది. ఏ క్షణాన్నయినా ఇస్రాయీల్ సైన్యం గాజాలో ప్రవేశించవచ్చని పలువురు భావిస్తున్నారు. గాజా అత్యంత జనసాంద్రత కలిగిన ప్రదేశం. గాజాలో ఇప్పుడు సాధారణ ప్రజల జీవితం దుర్భరమయ్యింది. మరోవైపు హమాస్ రాకెటు దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఇస్రాయీల్‌పై మొదటిసారి చేసిన మెరుపుదాడిలో అనేకమంది సాధారణ పౌరులు మరణించడమే కాదు, అనేక మందిని హమాస్ నిర్బంధించి గాజా తరలించింది. హమాస్ చేసిన మెరుపుదాడి ఇస్రాయీల్‌లో సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న భద్రతారాహిత్యాన్ని సూచిస్తోంది. అంతర్జాతీయ సమాజం ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నాలు చేస్తోంది. కాని గాజాలో ఇప్పుడు మానవీయ సంక్షోభం నెలకొని ఉంది. ప్రతి రోజు పరిస్థితి మరింత తీవ్రమవుతోంది. గాజాకు మానవీయ సహాయం అందించడానికి బ్రెజిల్ ఐక్యరాజ్యసమితిలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అమెరికా వీటోతో అడ్డుకుంది. ఇస్రాయీల్‌కు ఆత్మరక్షణ చేసుకునే హక్కు ఉందంటూ వాదించింది. కాని ఇస్రాయీల్ ఆత్మరక్షణ హక్కు పాలస్తీనాలోని సాధారణ ప్రజలు, పిల్లలను చంపడం కారాదని చాలా మంది వాదిస్తున్నారు. మరోవైపు అమెరికా వంద మిలియన్ డాలర్ల మానవీయ సహాయాన్ని పాలస్తీనాకు ప్రకటించింది. గాజాలో సాధారణ పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్న ప్రయత్నాలు కూడా చేస్తు న్నారు. గాజాలో 22 ఆసుపత్రులను వెంటనే ఖాళీ చేయాలని ఇస్రాయీల్ జారీచేసిన ఆదేశాన్ని ఐక్యరాజ్య సమితితో

పాటు పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి స్పష్టంగా ఇస్రాయీల్ దౌర్జన్యా లను, హమాస్ దాడికి దారితీసిన పరిస్థితులను గురించి మాట్లాడారు. అంతే కాదు, తక్షణం యుద్ధ విరమణ అవసరమని చెప్పారు. ఆ తర్వాత ఇస్రాయీల్ ఐక్యరాజ్యసమితి ప్రతినిధులకు కూడా వీసాలు నిరాకరించి తమ దేశంలో ప్రవేశించకుండా అడ్డుకుంది.

హమాస్, ఇస్రాయీల్ హింసాకాండలో సగటు ప్రజలు చిక్కు కున్నారు. అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. హమాస్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ, హమాస్ దాడిని ఖండిస్తున్న అమెరికా, పాశ్చాత్య దేశాలు ఇస్రాయీల్ దురాక్రమణలను, దౌర్జన్యాలను చూసి చూడకుండా వ్యవహరించడాన్ని ప్రపంచం గుర్తించడమే కాదు తప్పుపడుతోంది. గాజాలో ఆసుపత్రులపై ఇస్రాయీల్ చేస్తున్న దాడులను ఖండించడానికి కూడా అమెరికా ముందుకు రావడంలేదు. గాజా ఆసుపత్రిపై ఇటీవల ఇస్రాయీల్ చేసిన దాడిని పలు దేశాలు ఖండించాయి. ఈ దాడి తాము చేయలేదని, పాలస్తీనా మిలిటెంట్ల మిస్సయిల్ దారితప్పి ఆసుపత్రిపై పడిందని ఇస్రాయీల్ చేసిన వాదనను అమెరికా అధ్యక్షుడు గుడ్డిగా నమ్మడమే కాదు, అవే మాటలు ప్రకటించాడు. బిబిసి తదితర వార్తాసంస్థలు ఈ దాడి ఇస్రాయీల్ చేసిందేనని వివరణలతో సహా ప్రసారం చేశాయి. అమెరికా అధ్యక్షుడు, ఇస్రాయీల్ ప్రధాని చెబుతున్న అబద్ధాలు బట్టబయలయ్యాయి. గాజాలో పరిస్థితి అత్యంత భయంకరంగా ఉంది. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసి గాజాలో మానవీయ సహాయం అందజేసే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇస్రాయీల్ గాజాలోకి సైన్యం పంపే ప్రయత్నాలు మానుకోవాలని అన్నారు. అమెరికా మంత్రి బ్లింకెన్ గాజాలో సాధారణ ప్రజలకు సురక్షిత ప్రాంతాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. వెనిజులా అధ్యక్షుడు పాలస్తీనా అధ్యక్షునితో మాట్లాడి మానవీయ సహకారం అందించే ఏర్పాట్ల గురించి చర్చించారు. కాని ప్రపంచదేశాల్లో అమెరికా తదితర దేశాల వైఖరి, ఇస్రాయీల్ పట్ల చూపిస్తున్న మొగ్గు, ఇస్రాయీల్ పాల్పడుతున్న భయంకరమైన, అమానుష దాడులను ఖండించకపోవడం, ఇస్రాయీల్‌కు కావలసిన సహాయాన్ని తక్షణం అందించడం వంటివి ప్రపంచ దేశాలు గమనిస్తూనే ఉన్నాయి. ఇస్రాయీల్ దురాక్రమణలను అమెరికా ప్రోత్సహిం చడం వల్లనే పశ్చిమాసియాలో పరిస్థితి ఇలా దిగజారిందనే విమర్శలు ఎక్కువవుతున్నాయి. శాంతియుత పరిష్కారం ఇప్పటి వరకు లభించకపోవడానికి కారణం ఇస్రాయీల్ మొండివైఖరి, అమెరికా పక్షపాతాలే కారణమని చాలా మంది విమర్శిస్తున్నారు.

హమాస్ ఇస్రాయీల్ యుద్ధం ఈ ప్రాంతంలో మరింత విస్తరిస్తే యావత్తు ప్రపంచానికే ప్రమాదకరమైన పరిస్థితులు తలెత్తుతా యని పలువురు భావిస్తున్నారు. చైనాకు పోటీగా జి20 దేశాలు ఆలోచించిన రవాణా రోడ్డు నిర్మాణం ఇప్పుడు కూలబడింది. పైగా ఈరాన్‌ను నిలువరించడానికి అమెరికా యుద్ధఓడలను పంపితే ప్రతిచర్యగా చైనా తన యుద్ధనౌకలను మోహరించింది. లెబనాన్ నుంచి హిజ్బుల్లా దళాలు ఇస్రాయీల్ పై రాకెట్లను ప్రయోగించి యుద్ధంలో అవసరమైతే తాము కూడా దూకుతా మన్న సంకేతాలు పంపించాయి. హిజ్బుల్లా ఈ యుద్ధంలో అడుగుపెడితే పరిస్థితి మరింత దిగజారవచ్చు. హమాస్ ప్రయో గించిన 5 వేల రాకెట్లే ఇస్రాయీల్ లో బీభత్సాన్ని సృష్టించాయి. హిజ్బుల్లా వద్ద అత్యాధునిక మిస్సయిళ్ళతో పాటు బలమైన ఆయుధ సంపత్తి ఉంది. హిజ్బుల్లా రంగంలోకి వస్తే ఇస్రాయీల్ కు తీవ్రమైన పరిస్థితులు ఎదురుకావచ్చు. అప్పుడు ఇస్రాయీల్ ఉత్తరాన హిజ్బుల్లాతోను, దక్షిణాన హమాస్ తోను పోరాడవలసి వస్తుంది. గెరిల్లా యుద్ధంలో హిజ్బుల్లా దళాలకు ఉన్న అనుభవం ఇస్రాయీల్ కు కొత్త సవాళ్ళను విసరవచ్చు. హిజ్బుల్లా యుద్ధంలో ప్రవేశిస్తే, ఈరాన్ కూడా యుద్ధంలోకి వచ్చినట్లే. ఈరాన్‌తో పాటు ఇతర దేశాలు కూడా వచ్చే అవకాశం ఉంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలు చాలా ఇప్పుడు అయోమయస్థితిలో ఉన్నాయి. ఇస్రాయీల్ తో సాధారణ సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలనుకుంటున్న ఈ దేశాలకు ఇప్పుడు పరిస్థితి తిరగబడింది. సౌదీ ఇప్పుడప్పుడే ఇస్రాయీల్‌తో సంబంధాల ప్రయత్నాలు చేయకపోవచ్చు.

సాధారణ అరబ్బు ప్రజల్లో పాలస్తీనాకు ఇప్పుడు భారీ స్థాయిలో మద్దతు లభిస్తోంది. ఈరాన్ పాలస్తీనాకు మద్దతుగా మాట్లాడడమే కాదు, హిజ్బుల్లా కూడా రంగంలోకి వస్తే సౌదీ తదితర అరబ్బు దేశాలు కూడా ఒక నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి వస్తుంది. ఐక్యరాజ్య సమితి తక్షణం కాల్పుల విరమణకు పిలుపులు ఇస్తోంది. కాని వినేవారెవ్వరు? మధ్యప్రాచ్యంలో ఐక్యరాజ్యసమితి శాంతిదళాలను పంపిస్తుందా? అన్నది వేచి చూడాలి. ఇస్రాయీల్‌ను గుడ్డిగా సమర్థిస్తున్న అమెరికా పాశ్చాత్య దేశాల్లో కూడా ప్రజాభిప్రాయం పాలస్తీనాకు అను కూలంగా మారుతోంది. పరిస్థితిని చక్కదిద్దడానికి అమెరికా, పాశ్చాత్యదేశాలు దౌత్యపరంగా, సైనికంగా జోక్యం చేసుకునే అవకాశాలున్నాయని చాలా మంది భావిస్తున్నారు. కాగా, మరోవైపు రష్యా, చైనా దేశాలు మధ్యప్రాచ్యంలో పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. మధ్యప్రాచ్యంలో తమ పలుకుబడి పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. హమాస్, హిజ్బుల్లా దళాలకు ఈ దేశాలు సహాయం చేసే అవకాశాలు ఉన్నాయి.

ఈ యుద్ధం ప్రపంచానికి అనేక సమస్యలు తీసుకుని వస్తోంది. చమురు ధరలు పెరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు కుదేలవుతున్నాయి. హిజ్బుల్లా, హమాస్‌లకు మద్దతిస్తున్న దేశాలపై ఆంక్షలు విధించ వచ్చు. ఇదే జరిగితే ఈ ప్రాంతంలో పరిస్థితి మరింత చిక్కుముడి పడుతుంది. పరిస్థితి

ఇలాగే కొనసాగితే ప్రపంచ వ్యాప్తంగా పాలస్తీనాకు మద్దతు మరింత పెరుగు తుంది. గాజాలో మానవీయ సంక్షోభం పట్ల ఇప్పటికే ఆందోళనలు వ్యక్త మవుతున్నాయి. జకర్తా నుంచి టూనిస్ వరకు గాజాపై ఇస్రాయీల్ దాడులను ఖండిస్తూ ప్రదర్శనలు జరుగుతున్నాయి. పాలస్తీనా అధికారిక ప్రకటనల ప్రకారం గాజాలో నాలుగువేల మంది మరణించారు. పాశ్చాత్యదేశాలు ఇస్రాయీల్‌కు మద్దతుగా మాట్లాడుతున్నప్పటికీ ముస్లిం దేశాలు వెంటనే గాజాపై దాడులు ఆపాలని చెబుతున్నాయి. జోర్డన్ రాజధాని అమ్మాన్‌లో భారీ ప్రదర్శనలు జరిగాయి. హమాస్‌కు బాహాటంగా మద్దతు పలకడం కూడా ప్రజల్లో కనిపి స్తోంది. ఇరాక్‌లో కూడా ప్రజలు ఇస్రాయీల్ కు వ్యతిరే కంగా ప్రదర్శనలు నిర్వహించారు. వేలాది మంది ఈజిప్టులో ప్రదర్శనలు నిర్వహించి పాలస్తీనాకు సంఘీ భావం ప్రకటించారు. టర్కీలో ప్రభుత్వం గాజాపై దాడికి నిరసనగా మూడు రోజుల విషాదాన్ని ప్రకటించింది. టర్కీలో కూడా భారీగా ఇస్రాయీల్ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. ముస్లిం దేశాల్లోనే కాదు అమెరికాతో సహా పాశ్చాత్య దేశాల్లో కూడా భారీగా ప్రదర్శనలు జరుగు తున్నాయి. హమాస్ దాడి తర్వాత చోటు చేసుకున్న పరిస్థితులు ఇస్రాయీల్ దౌర్జన్యాల చరిత్రపై మరోసారి చర్చకు ప్రాణం పోశాయి. దశాబ్దాల దురాక్రమణలను ప్రపంచం ఇప్పుడు ప్రశ్నిస్తోంది. మరోవైపు ఇస్రాయీల్‌కు మద్దతుగా మాట్లా డిన ట్రూడోకు నిరసనల సెగ తగులుతోంది.

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు ఎదుర్కోవలసి వచ్చింది. టోరంటోలో ఇటీవల ఆయన ఒక మస్జిదును సందర్శించాడు. ఇస్రాయీల్ హమాస్ యుద్ధంలో ట్రూడో ఇస్రాయీల్ పక్షాన మాట్లాడడం, ఇస్రాయీల్ దుర్మార్గాలను చూసి చూడనట్లు వ్యవహరించడాన్ని ఇక్కడి ముస్లిం ప్రజానీకం నిలదీసి ప్రశ్నిస్తోంది. అక్టోబర్ 21వ తేదీన ఆయన ఒక మస్జిదు సందర్శించి అక్కడ సమావేశమైన వారిని సంబోధిస్తూ ప్రసంగించడానికి ప్రయత్నించినప్పుడు 'సిగ్గు సిగ్గు' అనే నినాదాలు మిన్నంటాయి. ప్లాకార్డులతో కొందరు ప్రదర్శనలు నిర్వహించారు. పశ్చిమాసియా సంఘటనల వల్ల ప్రభావితులైన వారి పట్ల తన సంఘీభావం ప్రకటించడానికి ట్రూడో ఆ మస్జిద్‌ను సందర్శించారు. టోరంటోలోని అంతర్జాతీయ ముస్లిం ఆర్గనైజేషన్ సందర్శించి ముస్లిముల పట్ల సంఘీభావం ప్రకటించ డానికి ఆయన వెళ్లారు. కాని హమాస్, ఇస్రాయీల్

## నమ్మినా నమ్మకపోయినా ? 9

## అభివృద్ధికి ఆటంకాలు

విషతుల్యమైన వాయువు పరిసరాలను ప్రభావితం చేయడమేగాక ప్రతి మనిషి ఆరోగ్యంపై దుష్ప్రభావాన్ని చూపుతుంది. సమాజ శ్రేయానికి పెను సవాలుగా మారుతుంది. నమ్మినా నమ్మకపోయినా ఆ విషతుల్యమైన వాయువును పంపిన దుష్ట శక్తులను కూడా అది ఇట్టే వదలిపెట్టదు. వారికీ హాని చేకూరుస్తుంది. అది సమాజంలోని ప్రతి మనిషినీ చుట్టుకుంటుంది. అదేవిధంగా సమాజంలో సంకుచితత్వాన్ని, దురభిమానాలను పంచి, పెంచి పోషిస్తున్న అరాచక శక్తులు సమాజాభివృద్ధికి ఆటంకంగా మారుతారు. ఇలాంటి విషతుల్యమైన దుర్గుణాలను, భావాలను, సంస్కృతిని వ్యాపింపజేసిన కారణంగా ఒకనాడు వారు కూడా వీటికి బలికాక తప్పదు. ఇలాంటి సంస్కృతిని ఎవరో పెంచి పోషిస్తున్నారు, మేమైతే అలాంటి వాటిని వ్యాపింపజేయటం లేదుకదా అని ఊరకుండి, తమాషా చూస్తున్నవారిని కూడా అది ప్రభావితం చేస్తుంది. వారు కూడా దీని వాతన పడక తప్పదు.

## బంజరు భూమిలో నాటిన మొక్కలు

బంజరు భూమిలో, చవిటి పర్రలలో మొక్కలు నాటితే ఆశించిన విధంగా ఎదగవు, ఫల పుష్పాదులను ప్రసాదించవు. కొద్దికాలంలోనే అవి వాడి నశించిపోతాయి. అదేవిధంగా ఒక సమాజంలో నైతిక విలువలు కొరవడితే, ఒకరి పట్ల మరొకరు ఆదరాభిమానాలను చూపక పోతే అలాంటి సమాజం కూడా బంజరు భూమిలో నాటిన మొక్కలా తయారవుతుంది. సమాజంలో అభివృద్ధి కుంటుపడుతుంది, సత్ఫలాలు అందవు, వాతావరణం విషతుల్యమైపోతుంది. ఫలితంగా కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతుంది. సమాజాభివృద్ధికి మూలం కుటుంబ వ్యవస్థే కదా! ఫలితంగా కుటుంబంలో శాంతి నశించి, అశాంతి నెలకొంటుంది.

మంచి, మానవీయ విలువలు, మర్యాదలు సమాజాభివృద్ధికి పట్టు కొమ్మలు. ఇలాంటి వాతావరణంలో పెరిగిన మానవులు స్వయంగా తమ అభివృద్ధికి, సమాజాభివృద్ధికి పాటుపడుతుంటారు. అప్పుడే సమాజంలో ఎటుచూసినా సుహృద్భావపూరిత వాతావరణం, శాంతి పరిఢవిల్లుతుంది. అప్పుడే మనందరి సృష్టికర్త అయిన దేవుడు మనం దరినీ కనికరిస్తాడు. ఇంకా మనపై తన కారుణ్యానుగ్రహాలను కురిపిస్తాడు.

**- డా. ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

యుద్ధంలో ఇస్రాయీల్ పక్షాన నిలబడిన వ్యక్తి ఇక్కడ సంఘీ భావం ప్రకటించడానికి రావడాన్ని చాలా మంది వేలెత్తి చూపిం చారు. ముస్లిం గ్రూపులతో పాటు లిబరల్ పార్టీ ఎంపీలు కూడా కలిశారు. టోరంటో లిబరల్ ఎం.పీ. సల్మా జాహిద్ కెనడా పాలస్తీనా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూపు చైర్‌పర్సన్. ఆమె ట్రూడోకు లేఖ రాసి గాజాలో తక్షణం కాల్పులు విరమణకు, మానవీయ సహకారానికి ప్రయత్నించాలని కోరారు. ఆ లేఖపై 33 మంది ఎం.పీలు సంతకాలు చేశారు. ట్రూడోకు ఎదురైన సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇస్రాయీల్ కు గుడ్డిగా మద్దతిస్తున్న పాశ్చాత్యదేశాల పాలకుల పట్ల ముస్లిముల్లో తీవ్ర వ్యతిరేకతను ఈ సంఘటనలు చాటి చెబుతున్నాయి.

ఇస్రాయీల్ హమాస్ యుద్ధంలో ఫేకు వార్తలు విజృంభిస్తు న్నాయి. ఖతార్ పాలకుడి ప్రసంగాన్ని భారతీయ ముస్లింలకు వ్యతిరేకంగా వక్రీకరించే ప్రయత్నాలు చేశారు. ఖతార్ పాలకుడు షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ సానీ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ వీడియో నిజానికి 2017 నాటిది కాని నేటి వీడియోగా ప్రచారంలో పెట్టారు. ఇజ్రాయెల్-పాలస్తీనా ఘర్షణలో భారత ముస్లింల ప్రమేయంపై ఆయన మాట్లాడినట్లు ఈ వీడియోను వక్రీకరించారు. ఈ వీడియో వాస్తవానికి మే 2017లో దోహా ఫోరమ్‌లో పాలస్తీనియన్ల అణచివేత గురించి ఆయన చేసిన ప్రసంగం. కేవలం 7 సెకన్లు మాత్రమే ఉన్న ఈ వీడియో క్లిప్ లో ఖతర్ పాలకుడు "భారత ముస్లింలు అరబ్ సమస్యలలో జోక్యం చేసుకోవడం మానేయాలి" అని చెప్పినట్లు చూపించారు. ఈ తప్పుదారి పట్టించే వీడియో ఫేస్‌బుక్‌లో కూడా షేర్ అయ్యింది. BOOM, నిజనిర్ధారణ ఈ ఫేక్ వీడియో వాస్తవాన్ని బట్టబయలు చేసింది. వీడియో 2017 నాటిదని స్పష్టం చేసింది. ఇందులో భారతీయ ముస్లింలు లేదా ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణల ప్రస్తావన లేదు. ఇప్పటిది కూడా కాదు. దేశంలో మతపరమైన ఉద్రిక్తతలను రేకెత్తించడానికి తప్పుడు సమాచారాన్ని ఎలా ఉపయోగిస్తున్నారో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. మరో ఫేక్ వార్తను చూద్దాం. గాజాలో హమాస్ నిర్బంధించిన యూదుపిల్లవాడిని చంపేశారన్న ఒక వార్త ప్రచారంలోకి వచ్చింది. అక్టోబరు 2023లో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హమాస్ మిలిటెంట్లు బంధించిన ఒక యూద పిల్లవాడిని చంపేసిన వార్త అబద్ధం. ఈ వార్తకు చాలా ప్రచారం ఇచ్చారు. ఈ వీడియో వాస్తవానికి సెప్టెంబర్ 8, 2023న టిక్ టాక్‌లో వచ్చిన వీడియో. ఇజ్జద్దీన్ మసల్మా అనే అతను పోస్టు చేశాడు. ఈ వీడియోను గాజాలో షూట్ చేయలేదు. వెస్ట్ బ్యాంక్‌లోని హెబ్రాన్ నగరంలో చిత్రీకరిం చారని అతను వివరణ కూడా ఇచ్చాడు. మసల్మా 2023 అక్టోబర్ 9న ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ వివరణ ఇచ్చి వీడియోలో ఉన్న పసిబిడ్డ అరబ్ అని, యూదు కాదని పేర్కొన్నారు. ఈ వీడియో ఒక నెల క్రితం హెబ్రోన్‌లో తీసిన వీడియో. ఇజ్రాయెల్ హమాస్ యుద్ధంతో దీనికి సంబంధమే లేదు. హమాస్ దాడి చేసింది అక్టోబర్ లో. నిజనిర్ధారణ సంస్థ Fatabyyano అక్టోబర్ 16, 2023న వీడియో ఫేక్ వీడియో అని నిరూపించింది. గాజాలో ఇస్రాయీల్ యుద్ధం నేపథ్యంలో ఇస్రాయీల్ కు మద్దతుగా ఫేక్ వార్తల ప్రవాహం వస్తోంది. ఇంకో ఫేక్ వార్త చూద్దం, ఇజ్రాయెల్‌ను ఖండించిన సౌదీ యువరాజు అనే వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ వీడియో కొత్త వివాదానికి కూడా కారణమయ్యింది. సౌదీ అరేబియా యువరాజు తుర్కీ బిన్ ఫైసల్ అల్ సౌద్ మాట్లాడిన పాత వీడియో ఇది. దీన్ని ఇప్పుడు మళ్లీ తెరపైకి తీసుకువచ్చారు. ఇజ్రాయెల్ హమాస్ యుద్ధం నేపథ్యంలో దీన్ని వాడుకుంటు న్నారు. ఈ వీడియో, వాస్తవానికి 2020 నాటిది. 2020లో డిసెంబర్ 4 నుంచి 6 వరకు బహ్రెయిన్‌లో జరిగిన IISS మనామా డైలాగ్ ఈవెంట్‌లో అల్ సౌద్ మాట్లాడిన వీడియో ఇది. ఇందులో ఆయన ఇస్రాయీల్ ను తీవ్రంగా ఖండిస్తూ మాట్లాడారు. బాల్ఫోర్ ప్రకటన తర్వాతి నుండి పాలస్తీనియన్లను బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారని ఇస్రాయీల్ పై ఆయన మండిపడ్డారు. ఈ వీడియోను అక్టోబర్ 16న ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్తగా షేర్ చేసారు. ఇది ఫేస్‌బుక్‌లోనూ వైరల్‌గా మారింది. వీడియో బ్యాక్‌గ్రౌండ్‌లో IISS మనామా డైలాగ్" అని స్పష్టంగా కనిపిస్తోంది.. డిసెంబర్ 6, 2020న ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ అప్‌లోడ్ చేసిన యూట్యూబ్ వీడియోలో అల్ సౌద్ చేసిన ప్రసంగం పూర్తిగా ఉంది. ఇప్పుడు ఇజ్రాయెల్ హమాస్ యుద్ధంలో అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన సందర్భంలో సౌదీ యువరాజు ఇలా మాట్లాడా రన్నట్లు చూపించడం ద్వారా వివాదాన్ని మరింత జటిలం చేయ డానికి, మరింత విస్తరించేలా చేయడానికి ప్రయత్నించారు. సౌదీ రాజవంశంలో సీనియర్లు ఇస్రాయీల్‌పై తిరగబడు తున్నారా అని మీడియాలో ప్రశ్నలు వచ్చాయి. ఇస్రాయీల్ ప్రచారయుద్ధాన్ని ఎలా వాడుకుంటుందో చెప్పే మరో ఉదాహరణ ఇది. మరో ఫేక్ వార్త చూద్దాం. ISIS కు చెందిన పాత వీడియో హమాస్-ఇజ్రాయెల్ యుద్ధానికి సంబంధించిందిగా ప్రచారంలో పెట్టారు. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు ఇద్దరు టర్కీ సైనికులను సజీవ దహనం చేస్తున్నట్లు ఆ వీడియోలో ఉంది. ఈ వీడియో 2016 నాటిది. ఇజ్రాయెల్ హమాస్ యుద్ధానికి సంబంధించిన వీడియోగా దీన్ని ప్రచారంలో పెట్టారు. సోషల్ మీడియాలో ఇజ్రాయెల్ సైనికులను హమాస్ చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు ఈ వీడియో ద్వారా ప్రచారం ప్రారంభించారు. భారతీయ జనతా పార్టీ ఢిల్లీ విభాగానికి చెందిన మాజీ అధికార ప్రతినిధి నవీన్ కెఆర్ జిందాల్ ఈ వీడియోను షేర్ చేశాడు. నిజనిర్ధారణకు ప్రయత్నించిన BOOM వార్తాసంస్థ వీడియో నిజాలను బయ టకు తీసింది. రివర్స్ ఇమేజ్ సెర్చ్‌లో వీడియో వాస్తవానికి

2016 నాటిదని స్పష్టం చేసింది. ఈ వీడియో ఐసిస్ కు సంబంధించిన వీడియోగా కూడా స్పష్టం చేసింది. డిసెంబర్ 23, 2016 నాటి BBC రాయిటర్స్ నివేదికల్లోను ఇది ఉంది. ఉత్తర సిరియాలో టర్కీ చేపట్టిన సైనిక చర్యలకు ప్రతీకారంగా ఐసిస్ ఈ వీడియోను అప్పట్లో విడుదల చేసింది. ఇప్పుడు ఈ వీడియోను ఇస్రాయిల్ సైనికులపై హమాస్ చిత్రహింసలని ప్రచారంలో పెట్టారు. ఇస్రాయిల్ ప్రచారయుద్ధం ఎలా సాగిస్తుందో దీన్ని బట్టి అర్థమవుతోంది. ఇక్కడ మనదేశంలో ఫేకు వీరులు ఈ ఫేక్ వార్తలను ఇస్రాయిల్ కన్నా ఉత్సాహంగా ప్రచారంలో పెడుతున్నారు. నాలుగేళ్ళ పాలస్తీనా చిన్నారి విషాద మరణం గురించిన వార్త ఒకటి వచ్చింది. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రభుత్వం అక్టోబర్ 14, 2023న వివాదాస్పద ప్రకటన చేసింది. ఆన్‌లైన్‌లో ప్రసారం అవుతున్న వీడియోలో చూపిస్తున్నట్లు బాంబు దాడుల్లో చనిపోయింది పాలస్తీనా బిడ్డ కాదు బొమ్మను చూపించారని చెప్పింది. ఇజ్రాయెల్ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్ఈ ప్రచారం చేశాయి. ఫ్రాన్స్,ఆస్ట్రియాలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయాలు దీనికి మరింత ప్రచారం కల్పించాయి. హమాస్ అబద్ధాలు అంటూ ప్రచారం చేశారు. ఆల్ట్ న్యూస్ ఈ తప్పుడు కథనాన్ని ఖండించింది. AFP ఫోటో జర్నలిస్ట్ మహ్మద్ అబేద్ తీసిన ఫోటోగా ఇది గెట్టి ఇమేజెస్ లో ఉంది. ఒక పాలస్తీనియన్ వ్యక్తి బట్టల్లో చుట్టబడిన చిన్నారిని తీసుకెళుతున్న చిత్రం ఇది. అక్టోబరు 12, 2023న గాజా సిటీలో తీసిన చిత్రం అని క్యాప్షన్ ధృవీకరిస్తోంది. మోమెన్ ఎల్ హలాబి అనే పాలస్తీనియన్ ఫోటోగ్రాఫర్ కూడా ఇజ్రాయెల్ వాదనను ఖండించారు. అక్టోబరు 12న గాజా నగరానికి తూర్పున ఉన్న అల్-జైటౌన్ పరిసరాల్లో ఓల్డ్ ఒమర్ బిలాల్ అల్-బన్నా అనే నాలుగేళ్ళ పసివాడు చంపబడ్డాడు. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఆ రోజు మొత్తం 51 మంది మరణించారు, 281 మంది గాయపడ్డారు. ఇస్రాయిల్ తప్పుడు ప్రచారాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో నిరూపించే మరో ఉదాహరణ ఇది. గాజా యుద్ధంలో ఇక్కడి మతతత్వ శక్తులు అత్యుత్సాహంగా ఇస్రాయిల్ కు మద్దతిస్తున్నాయి. చాలా ఫేక్ వార్తలకు భారతదేశం కేంద్రంగా ఉండడం విచిత్రం. అక్టోబర్ 16, 2023న అల్ జజీరాలో మార్క్ ఓవెన్ జోన్స్ ప్రచురించిన నివేదిక ఈ వాస్తవాన్ని బట్టబయలు చేసింది. అక్టోబరు 7న దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి జరిగినప్పటి నుండి భారతదేశంలోని మతతత్వ శక్తుల ఖాతాలు పాలస్తీనా వ్యతిరేక కథనాలను చురుకుగా ప్రచారంలో పెడుతున్నాయి. హమాస్ ఒక యూద శిశువును కిడ్నాప్ చేసిందని,ఒక యువకుడి శిరచ్ఛేదం చేసిందని తప్పుడు కథనాలను ప్రచారం చేయడం జరిగింది. నిజనిర్ధారణ చేసే BOOM ప్రకారం పాలస్తీనాకు వ్యతిరేకంగా, ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఈ తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఉదాహరణకు ఒక పాలస్తీనియన్ మిలిటెంట్లు అమ్మాయిలను సెక్సు బానిసలుగా మార్చారన్న వీడియో 60 లక్షల ఇంప్రెషన్స్ పొందింది. ఈ వీడియోను షేర్ చేస్తున్న చాలా ఖాతాలు భారతదేశంలోనే ఉన్నాయి. ఇది ఫేక్ వీడియో. హమాస్ ఒక యూదు శిశువును కిడ్నాప్ చేసినట్లు చెప్పే మరొక ఫేక్ వీడియో30 లక్షల ఇంప్రెషన్స్ పొందింది. అత్యధికంగా షేర్ చేయబడిన టాప్ 10 ట్వీట్లలో ఏడు భారతదేశంలోని ప్రొఫైల్‌ల నుండి వచ్చాయి. భారతదేశంలో ఇస్లామోఫోబియా పెరగడం, ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అతని భారతీయ జనతా పార్టీ నాయకత్వం పెరుగుతున్న ఇస్లామోఫోబియా ఈ తప్పుడు ప్రచారం వెనుక ఉందని చాలా మంది విశ్లేషిస్తున్నారు. స్వాతి చతుర్వేది రాసిన “ఐ యామ్ ఏ ట్రోల్” పుస్తకంలో వెల్లడించిన విధంగా, BJP IT సెల్ ఆన్‌లైన్ ద్వేషానికి ముఖ్యమైన వేదికగా మారింది. హమాస్ దాడి తర్వాత తప్పుడు సమాచారం వెల్లువెత్తినందుకు ఇటీవల సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ Xని కొనుగోలు చేసిన ఎలోన్ మస్క్‌కి యూరోపియన్ యూనియన్ హెచ్చరిక కూడా పంపింది.

ది వైర్ వార్తా సంస్థలో కునాల్ పురోహిత్ రాసిన వ్యాసంలో భారతదేశంలో మతతత్వ శక్తులు చేస్తున్న ప్రచారాన్ని విశ్లేషించారు. పాలస్తీనీయన్లను విలన్లుగా చూపించడం, భారతదేశంతో పోలికలు తీసుకువచ్చి, భారతదేశంలో ఇస్లామ్ ముస్లిముల వల్ల చాలా ప్రమాదం ఉందనే వాతావరణం సృష్టించి, నరేంద్రమోడీ తప్ప మరెవ్వరు దేశాన్ని కాపాడలేరన్నట్లు బీజేపీకి మద్దతు కూడగట్టడం. రానున్న ఎన్నికల్లో బీజేపీకి గాజా యుద్ధం చాలా ఉపయోగపడుతుందని ఈ శక్తులు భావిస్తున్నాయి. ఈ మతతత్వ శక్తులు ఇస్రాయిల్ ప్రజల పరిస్థితిని కశ్మీరీ హిందువులతో పోల్చుతున్నాయి. హమాస్ బంధించిన యూదుల చిత్రాలను ప్రచారంలో పెట్టి వాళ్ళ ముఖాల్లో భయం చూడండి. ఇదే పరిస్థితి 1990లో కశ్మీరీ హిందువులకు ఉండేదంటూ ప్రచారం చేస్తున్నారు. హమాస్ ను మొగల్ చక్రవర్తులు బాబర్ హుమాయున్లతో పోల్చడం, వీళ్ళంతా ముస్లిమేతరులను ఉద్దేశ్యపూర్వకంగా దాడి చేస్తారన్నట్లు ప్రచారం చేయడం జరుగుతుంది. ఇలాంటి విద్వేష ప్రచారం ఇప్పుడు చాలా పెద్దస్థాయిలో జరుగుతుంది.

ప్రొఫెసర్ అపూర్వానంద్ భారతదేశంలోని ఈ ధోరణిని ది వైర్‌లో చక్కగా విశ్లేషించారు. ఆయన ఏం రాశారంటే, నేడు భారత ప్రజలు బ్రిటీషు వలస సామ్రాజ్యాన్ని మరిచిపోయారు. వారికి ఇప్పుడు కేవలం ముస్లిం రాజుల పరిపాలననే వలస పాలనగా భావించేలా బ్రెయిన్ వాష్ చేయడం జరిగింది. వాస్తవమేమిటంటే, సోషల్ మీడియాలో హిబ్రూ భాషలో యుద్ధాన్ని ముగించాలని వస్తున్న సందేశాలు ఎక్కువగా ఉంటే, హిందీ భాషలో గాజాను నాశనం చేయాలన్న సందేశాలు ఎక్కువగా ఉన్నాయంట. ఇది అతిశయోక్తిగా కనపించవచ్చు, కాని భారత ప్రధాన చానళ్ళలో గాజాపై ఇస్రాయిల్ దాడి చేసిన వెంటనే

పట్టరాని ఆనందం కనిపించిందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. పాశ్చాత్య మీడియా ఇస్రాయీల్‌ను సమర్థించడం ఎప్పటి నుంచో జరుగుతూ వస్తోంది. ఇప్పుడు భారత ప్రధాన మీడియా కూడా ఇస్రాయీల్‌ను సమర్థించడంలో స్వయంగా ఇస్రాయీల్ మీడియాను కూడా తలదన్నుతోంది. హమాస్ దాడిలో ఇస్రాయీల్ సాధారణ పౌరులు చనిపోవడం నిస్సందేహంగా ఖండించదగిన చర్య. భారత మీడియాలో దీనిపైనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. కాని ఇస్రాయీల్ దాడుల్లో అమాయకపు పాలస్తీనా పిల్లలు కూడా పెద్ద సంఖ్యలో చనిపోతున్నప్పటికీ వారి గురించి ఎక్కడా వినిపించడం లేదు. హమాస్‌ను నాశనం చేయాలంటే పాలస్తీనా సాధారణ ప్రజలపై దాడులు తప్పవని సమర్థిస్తున్నట్లు మాట్లాడుతున్న వారు ఎక్కువగా కనిపిస్తున్నారు. హమాస్ అకారణంగా ఇస్రాయీల్ పై దాడి చేసిందన్న ప్రచారం ఎక్కువగా జరుగుతోంది. ఈ యుద్ధం హమాస్ వల్లనే ప్రారంభమైందన్నట్లు మాట్లాడుతున్నారు. అపూర్వానంద్ తన వ్యాసంలో ఇస్రాయీల్ యూద జర్నలిస్టు అమిరా హాస్ రాసిన విషయాలను ప్రస్తావించారు. చరిత్ర హమాస్ దాడి తర్వాత ప్రారంభం కాలేదని, గాజా, వెస్ట్ బ్యాంకుల్లో ఇస్రాయీల్ సైన్యం, సెట్లర్లు అమానుష దౌర్జన్యాలకు పాల్పడడం కొనసాగించకుండా ఉన్నట్లయితే ఈ దాడి జరిగేదే కాదని ఆమె రాశారు. యూద జర్నలిస్టుల్లో ఉన్న అవగాహన మన ప్రధాన స్రవంతి మీడియాలో కనిపించడం లేదు. ప్రధాని నరేంద్రమోడీ హమాస్ దాడి జరిగిన వెంటనే ఇస్రాయీల్ కు సంఘీభావం ప్రకటించేశారు. ఆ వెంటనే మన మీడియా గాజా సర్వనాశనం అయిపోవాలన్న వైఖరితో ప్రసారాలు చేయడం ప్రారంభించేసింది. హమాస్ దాడిని ఖండిస్తూ, భారతదేశం సుదీర్ఘకాలంగా కట్టుబడిన వైఖరి ప్రకారం తక్షణం యుద్ధవిరమణ కోసం పిలుపు ఇచ్చి ఉండాల్సింది. కాని మోడీ అలా చేయలేదు. ఇప్పటికి కూడా భారతదేశం యుద్ధవిరమణ గురించి మాట్లాడలేదు. రానున్న ఎన్నికల్లో ముస్లిములను విలన్లుగా చూపించడానికి మరో అవకాశం దొరికిందన్న ఆనందం మతతత్వ శక్తుల్లో కనిపిస్తుంది. హమాస్ సాకుతో మొత్తం ముస్లిం సమాజాన్ని బోనులో నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. కరోనా కాలంలో తబ్లీగీ జమాఅత్ గురించి జరిగిన ప్రచారం, తబ్లీగీ సాకుతో మొత్తం ముస్లిం సమాజాన్ని విలన్లుగా మార్చడానికి చేసిన మీడియా ప్రయత్నాలు ఒకసారి గుర్తు చ్నేసుకుంటే భారతదేశంలో ఇస్లామోఫోబియా ఏ స్థాయికి చేరుకుందో అర్థమవుతుంది. ఇప్పుడు మతతత్వ శక్తులు గాజాలో పాలస్తీనీయన్లను అందరినీ ఖాళీ చేయించి ముస్లిం దేశాలకు పంపేయాలని కూడా అంటున్నారు. ఇదే వాదన ఇక్కడ ఇండియాలో ముస్లిములందరిని ఖాళీ చేయించి పాకిస్తాన్‌కు పంపేయాలనే వాదన. పశ్చిమాసియాలో యుద్ధాన్ని భారత దేశంలో ముస్లిములను విలన్లుగా చూపించడానికి, వారి మతంపై బురద జల్లడానికి వాడుకుంటున్న తీరు అందరూ గమనించాలి.

ఇప్పుడు పాలస్తీనాకు మద్దతిచ్చేవారిని ఉగ్రవాదానికి మద్దతిచ్చే వారుగా ముద్రవేయడం కూడా జరుగుతోంది. పాలస్తీనాకు మద్దతిస్తే కేసులు పడే అవకాశాలున్నాయి. ఉదాహరణకు అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం విద్యార్థులు పాలస్తీనాకు మద్దతుగా ర్యాలీ తీశారు. ఈ ర్యాలీ శాంతియుతంగా జరిగినా వారిపై కేసులు పడ్డాయి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ర్యాలీ తీసిన వారితో కఠినంగా వ్యవహరించాలని ప్రత్యేకంగా ఆదేశాలిచ్చారట. ఉత్తరప్రదేశ్ లఖీంపూర్‌లో ఉన్న ఒక కానిస్టేబుల్ పాలస్తీనాకు మద్దతుగా ఒక పోస్టును రీ షేర్ చేశాడు. అతడిని వెంటనే సస్పెండ్ చేశారు. పాలస్తీనాకు మద్దతుగా పోస్టులు పెట్టిన ఇద్దరు ముస్లిములపై ఉత్తరప్రదేశ్‌లో కేసులు పడ్డాయి. ఢిల్లీలో కూడా పాలస్తీనాకు మద్దతు ర్యాలీలో పాల్గొన్న వారిని నిర్బంధించారు. కశ్మీరులోని శ్రీనగర్లో జామా మస్జిదులో శుక్రవారం ప్రార్థనలు చేయకుండా నిషేధించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే కాదు కాంగ్రెసు అధికారంలో ఉన్న కర్నాటకలో కూడా పాలస్తీనా మద్దతు ర్యాలీలో పాల్గొన్న వారిని పోలీసులు అరెస్టులు చేశారు. మహారాష్ట్రలో పాలస్తీనాకు మద్దతుగా ప్రదర్శనల్లో పాల్గొన్న వారిని నిర్బంధించడమే కాదు చావగొట్టారు.

ఇదంతా చూస్తుంటే ఏమనిపిస్తోంది. ఒకప్పుడు పాలస్తీనాకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ న్యాయం కోసం నిలబడిన భారతదేశం ఇప్పుడు ఇస్రాయీల్ పక్షాన బలంగా నిలబడినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మార్పు ఎలా వచ్చింది? అపూర్వానంద్ దీన్ని విశ్లేషిస్తూ ఏం రాశారంటే, ఇస్రాయీల్ యూద దేశంగా ఏర్పడింది. అక్కడ యూదులు మొదటి తరగతి పౌరులు. హిందూరాష్ట్ర కోరుతున్న వారు కూడా ఇలాంటి దేశాన్నే కోరుతున్నారు. ఇస్రాయీల్ మాదిరిగా మారాలనుకుంటున్నారు. ఒకప్పుడు నాజీలను హీరోలుగా భావించిన వారు ఇప్పుడు ఇస్రాయీల్‌ను హీరో అనుకుంటున్నారు. నిజానికి ఎవరు ప్రబలంగా ఉంటారో, ఎవరు బలహీనులను అణిచేస్తారో వారే ఈ మతతత్వ శక్తులకు హీరోలు. నేడు భారతదేశంలో 50 శాతం జనాభా 30 సంవత్సరాల కన్నా తక్కువ వయసు ఉన్న జనాభా. దక్షిణాఫ్రికాలో జాత్యాహంకార ప్రభుత్వాల గురించి ఈ జనాభాకు తెలియదు. పాలస్తీనాలో యూదులు ఎలా ప్రవేశించారో ఈ జనాభాకు తెలియదు. అమెరికా మెడలు వంచి ఇందిరాగాంధీ ఎలా బంగ్లాదేశ్‌ను విముక్తం చేసిందో ఈ జనాభాకు తెలియదు. పైగా ముస్లిములను విలన్లుగా చూపించే ప్రచారం జోరుగా సాగుతున్నప్పుడు వాస్తవాలు తెలుసుకునే వేరే మార్గం లేనప్పుడు ఈ మతతత్వ విద్వేష ప్రచారంలో మునిగిపోవడంలో ఆశ్చర్యము కూడా లేదు. రాహుల్ గాంధీ చెప్పే రాజకీయ బాజారులో ప్రేమాభిమానాల దుకాణం ఈ వాతావరణంలో నడుస్తుందా? వేచి చూద్దాం. ✤

## 'చరితార్థులు'-2



# పఠాన్ తుర్రేబాజ్ ఖాన్

## (-1859)

**21**




**ఆధునిక** ఆయుధాలు కలిగి, అపారమైన సైనిక బలగాలున్న బ్రిటిష్ పాలకులను ఎదుర్కోవటం మృత్యువును వాటేసుకోవడమని స్వదేశీ యోధులకు స్పష్టంగా తెలిసినా, తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి పరాయి పాలకులను తరిమి కొట్టేందుకు అలనాడు నడుం కట్టిన పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నివాసి. ఆయన తండ్రి పఠాన్ రుస్తుం ఖాన్. బ్రిటీష్ సైన్యంలో సైన్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ పరాక్రమాలకు పెట్టింది పేరైన రొహిల్లా సైనిక పటాలం నాయకుడు. ఆంగ్లేయులకు హితుడుగా మారిన నిజాం నవాబు అభీష్టానికి వ్యతిరేకంగా బ్రిటీష్ పాలకుల నుండి మాతృదేశాన్ని విముక్తి చేయమన్న మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ ఉద్బోధ మేరకు తుర్రేబాజ్ ఖాన్ పోరుబాట ఎంచుకున్నారు. మౌల్వీ అల్లావుద్దీన్ సహకారంతో చరిత్రాత్మక మక్కా మసీదు నుండి బయలుదేరి, బ్రిటీష్ ఆధిపత్యానికి చిహ్నమైన హైదరాబాద్ రెసిడెన్సీ మీద సుమారు ఐదు వందల మంది సాహసికులతో 1857 జూలై 17న తుర్రేబాజ్ ఖాన్ సాహసోపేతమైన దాడి చేశారు. ఆ పోరాటంలో పలువురు సహచరులను కోల్పోయి గాయపడిన ఆయన బ్రిటీష్– నిజాం బలగాలకు 1857 జూలై 22న పట్టుబడగా ప్రభుత్వం ద్వీపాంతరవాస శిక్ష విధించి, ఆయన యావదాస్తిని స్వాధీనం చేసుకుంది. ఆంగ్లేయాధికారుల సలహామేరకు విధించిన ఆ శిక్ష అమలు జరిగేలోగా పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ 1859 జనవరి 18న జైలు నుండి తప్పించుకున్నారు. ఆగ్రహించిన ప్రభుత్వం తుర్రేబాజ్ ఖాన్‌ను సజీవంగా గానీ నిర్జీవంగా గానీ పట్టితెచ్చిన వారికి అయిదు వేల రూపాయల నగదు నజరానాను 1859 జనవరి 19న ప్రకటించింది. పాలకులు ప్రకటించిన నజరానాకు ఆశపడిన కుర్బాన్ అలీ అను నమ్మకద్రోహి అందించిన సమాచారంతో మెదక్ జిల్లాలోని తూప్రాన్ గ్రామం మీద 1859 జనవరి 24న నిజాం, బ్రిటిష్ సైన్యాలు విరుచుకుపడ్డాయి. ఆ సైన్యాలను సాహసోపేతంగా ఎదుర్కొంటూ తుర్రేబాజ్ ఖాన్ శత్రువు సైనికుల తుపాకి గుండ్లకు బలయ్యారు. ఆ యోధుని పార్థివ శరీరాన్ని హైదరాబాదు నగరానికి తరలించి అంత్యక్రియలు ఏవీ జరపకుండా బలమైన ఇనుప గొలుసులతో కట్టేసి ప్రస్తుత సుల్తాన్ బజారు పోలీసు స్టేషన్ ఉన్న చోట గుంజకు బహిరంగంగా వేలాడదీశారు. ప్రజలలో తిరుగుబాటు ఆలోచనలు ఏ మాత్రం మళ్ళీ పొడ చూపకుండా వారిలో భయోత్పాతం కల్గించేందుకు ఆంగ్లేయులు అత్యంత పాశవిక చర్యలకు పాల్పడ్డారు. చివరకు మాతృభూమి విముక్తి పోరాటం విజయవంతం కావడంతో భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర పుటలలో గౌరవప్రదమైన స్థానం పొందిన పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ ప్రజల హృదయాలలో చిరస్మరణీయులుగా నిలిచారు.

★ ★ ★




**9440241727**


బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

అధ్యాయం 1

3

# నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)

ఎస్.ఎమ్. మలిక్

## 3. ప్రవక్త శ్రీ (స)తో అబూ బక్ర్

ఆ రోజుల్లో ప్రవక్త శ్రీ, ఆయన అనుయాయిగణం నెరిపిన అవిరళ కృషి మూలంగా ఒక్కొరొక్కరే ఇస్లామ్ పరిధిలోకి చేరిపోతున్నారు. తిరస్కారులు వ్యాపింపజేసిన పుకారులూ, అడ్డంకులు, దౌర్జన్యాలు, అత్యాచారాలకు భయపడి వెనుకంజ వేయక ఒకే దేవుని భక్తుల వర్గం క్రమేణ బాగా పెరిగింది. అలాగే వారి పైన హింసా కాండ కూడా సరికొత్త రూపాలు ధరించింది. కొందరిని నిప్పు కణికల పైన పరుండ బెట్టేవారు, కొందరిని కట్టి తలక్రిందులుగా నీట ముంచేవారు, కొందరిని చాపలో చుట్టి పొగ బెట్టేవారు. ఇస్లామ్ స్వీకరించిన కారణంగా ఆపదల్లో చిక్కక పోయిన వారు ఎవ్వరూ లేరు.

ఇస్లామ్ స్వీకరించిన తరువాత ముస్లిముల పట్ల మక్కా వాసుల ఆగడాలు మరీ అధికమయి వారి మనుగడ దుర్భరమయిన రోజుల్లో కొందరు ముస్లిములు ప్రవక్త శ్రీ ఆదేశంతో అబీసీనియాకు హిజ్రత్ చేశారు. ఆ తరువాత అబూ బక్ర్, తన ధార్మిక సోదరుల పైన జరిగే దౌర్జన్యాలు, అత్యాచారాలు భరించలేక తాను కూడా ప్రవక్త ఆనతి పొంది అబీసీనియాకు ఒంటరిగా బయలుదేరారు. దాదాపు ఒక దినం పయనించిన తరువాత దారిలో ఆయనకు ఇబ్నుద్దగినా అనే పెద్ద మనిషి ఎదురయ్యాడు. ఎందుకు ఇలా ఒంటరిగా బయలు దేరారని అతను అడగ్గా ఆయన చెప్పిన కారణం విని అతను బాగా బాధ పడ్డాడు.

## సజ్జనుడయిన వ్యక్తి

“మీరు అగత్యపరుల అవసరాలను తీరుస్తారు, బంధువులకు ఆశ్రయం కల్పిస్తారు, లేని వారినీ నిరుపేదలనూ వారి అప్పులు తీర్చి ఆదుకుంటారు, ఇతరుల భారాన్ని నెత్తిన వేసుకుంటారు, అతిథులకు మర్యాదనిచ్చి గౌరవిస్తారు, కష్టాలలో ఉన్న వారికి సేవలనందజేసి సహాయ పడతారు. మీ వంటి సద్గుణ సంపన్నులు నగరం నుండి వెళ్ళనేరాదు, వారిని వెళ్ళ నివ్వనూ రాదు” అంటూ “నేను మీకు ఆశ్రయం కల్పిస్తాను, మీరు దయచేసి వెనుతిరగండి” అని వేడుకున్నాడు. ఇదీ ఆయన స్థానం సమాజంలో!

ప్రవక్త ముహమ్మద్ (స) దైవ సందేశం అందగానే దాన్ని ప్రజలందరికీ చేరవేయడానికి ఉద్యుక్తులయ్యారు. అంతే, తిరస్కారులు ఒక్క సారిగా దైవ సందేశహరుల పైకి, దాన్ని విశ్వసించి అనుసరించిన వారి పైకి ఎగబడి పీడించడం మామూలయి పోయింది. మక్కాలో ఆ విధంగా పదమూడేళ్ళు గడిచాయి, ఈ కాలమంతా ఆయనకు తోడునీడగా, మిత్రునిగా, సలహాదారునిగా, ఉదయం సాయంత్రం చేదోడు వాదోడుగా ఉన్నవారు, మహనీయ అబూ బక్ర్ (ర).

## ప్రవక్త(స)తో బంధుత్వం

ప్రవక్త శ్రీ, అబూ బక్ర్‌తో మైత్రీ సంబంధం మాత్రం సరిపోదని అనుకున్నారు, తన కుటుంబంలో భాగస్వామ్యం ఇవ్వాలని కోరుకున్నారు. అబూ బక్ర్ చిన్న కూతురు ఆయిషాకు అప్పుడు ఆరేళ్ళు. కాని బుద్ధి వివేకాల రీత్యా, అవగాహన, గ్రహణశక్తి, సామర్థ్యాల రీత్యా సహజంగానే తన ఈడు వారిని ఎంతో మించి పోయారామె. జ్ఞాపక శక్తి కూడా అద్భుతమయినది. ‘ఈ అమ్మాయి

పెద్దదయి ధార్మిక విషయాల విద్య గ్రహించినట్లయితే సమాజంలో ధార్మిక అవగాహన వ్యాపింపజేసేందుకు ఎంతగానో ప్రయోజనకరం కాగల'దని భావించారు ప్రవక్త మహనీయులు (స).

అప్పటికే మహనీయ ఖదీజా పరమపదించి కొన్నాళ్ళయి పోయింది. ప్రవక్త ఇంట్లో ఇద్దరు చిన్న బాలికలూ ఉన్నారు. వారి పెంపకం కూడా ఓ సమస్యే ప్రవక్త శ్రీ కి. కాగా మహనీయ ఖౌలా ప్రేరణతో ఆయన మహనీయ ఖౌలా ద్వారానే ఈ విషయాన్ని అబూ బక్ర్ కుటుంబానికి అందజేశారు. ఉమ్ము రూమాన్ అబూ బక్ర్‌తో సంప్రదించారు. "ఇంతకన్నా కావలసిందేముందీ, కాని నేను లోగడ ఓ పెద్ద మనిషి ముత్‌యిమ్‌కు మాట ఇచ్చి ఉన్నాను, నేనెన్నడూ మాట తప్ప లేదు, ఇప్పుడూ తప్పను" అన్నారాయన.

అయితే ముత్‌యిమ్ ఎంతో ఉత్తమ గుణశీలుడయిన వ్యక్తి అయినప్పటికీ తాను కూడా మరో విధంగా ఆలోచించాడు. 'అబూ బక్ర్ కూతురు కోడలయి నా ఇంటికి వస్తే ఇక్కడ ఇస్లామ్ తిష్ఠ వేస్తుంది.' అందువల్ల కొన్నాళ్ళ తరువాత తానే ఆ సంబంధాన్ని కాదన్నాడు. ఆ తరువాత ప్రవక్త వివాహం ఆయిషాతో, దైవ దౌత్యం తరువాత పదవ సంవత్సరం జరిగింది. ఇలా అబూ బక్ర్‌తో బంధుత్వం ఏర్పడింది ప్రవక్త శ్రీ (స)కి. అయితే మహనీయ ఆయిషా, మూడేళ్ళ తరువాత మదీనా పవిత్ర నగరికి హిజ్రత్ జరిగిన తరువాతనే ప్రవక్త ఇంట ప్రవేశించారు.

ప్రవక్త మహనీయులు మహనీయ ఆయిషాను గురించి ఆలోచించిన విషయం ఏమేరకు నిజమయినదో తరువాతి చరిత్ర రూఢ పరిచింది. ఆమె గారు మహనీయులు అబూ బక్ర్‌తో సహా ఉమర్, ఉస్మాన్(ర) ఖిలాఫత్ కాలంలోనూ ఫత్వా (ధార్మిక తీర్పులు) ఇచ్చేవారు. పేరుగన్న సహచర మాన్యులు సమస్యతో చిక్కుబడి నప్పుడు ఆమెవద్దకు సలహా కోరుతూ వచ్చేవారు. పండితుల ప్రకారం, షరీఅత్‌లో పాతిక భాగం, విశ్వాసుల మాతృమూర్తి మహనీయ ఆయిషా(ర) ఒక్కరి ద్వారానే సముదాయానికి ప్రాప్తమయింది!

## హిజ్రత్

ఆ పదమూడేళ్ళు తన ప్రాణ హానికీ వెరువక మహనీయ అబూబక్ర్ (ర), ఆయన(స)కు సహాయకునిగా మెలగటమే కాదు, ప్రవక్త శ్రీకి ప్రాణసంకటం ఏర్పడి ఆయన (స) దైవాజ్ఞ ననుసరించి మదీనాకు హిజ్రత్ చేయాలని సంకల్పించినప్పుడు, మక్కా పుణ్యపురి నుండి బయలుదేరి మక్కాకు వెలుపల ఓ కొండ గుహలో మూడు దివారాత్రులు ప్రవక్త శ్రీ తో గడిపిన గౌరవం ఆయనకే దక్కింది.

దివ్య కుర్‌ఆన్‌లో కూడా ఈయన ప్రస్తావన వచ్చింది:

"అప్పుడు ఆయన (ప్రవక్త) కేవలం ఇద్దరిలో రెండవ వారు, వారిరువురూ గుహలో ఉన్నారు, అప్పుడు ఆయన తన మిత్రునితో అంటున్నారు, 'చింతిల్లకు, దైవం మనకు తోడయి ఉన్నాడు.'' (అత్ తౌబా 9:40)

ఆ ఇద్దరిలో ఒకరు ప్రవక్త శ్రీ (స) అయితే ఆ రెండవ వారు మరెవరో కాదు, మహనీయ అబూబక్ర్ (ర)!

ఆ సందర్భంలో మహనీయ అబూ బక్ర్ చేసిన ఓ మహత్తర త్యాగం ప్రస్తావించ దగింది. ప్రవక్త శ్రీ(స) తోపాటు మహనీయ అబూ బక్ర్ సౌర్ కొండ గుహకు చేరి ఆ చీకటి గుహలో అడుగు పెట్టిన తరువాత ముందుగా అబూ బక్ర్ దాన్ని శుభ్ర పరిచారు. దాన్ని లోపలి నుంచి పరికించి చూసి దాని బెజ్జాలన్నీ తన దుప్పటిని చించి మూసివేశారు. ఆ తరువాత అబూ బక్ర్ కూర్చోగా ప్రవక్త శ్రీ ఆయన ఒడిలో తల పెట్టి నిద్ర పోయారు.

ఆ చీకటిలో కనబడక పోయిన ఓ బెజ్జం నుంచి ఓ పాము బుస కొట్టింది. పామును కొట్టడానికి తాను లేస్తే ప్రవక్తకు నిద్ర భంగమవుతుందని, పామును చేత్తో బెదిరించి తన కాలి బొటనవేలు ఆ బెజ్జానికి అడ్డు పెట్టారు అబూ బక్ర్ (ర). పాము కాటు వేసింది. బాధకు తట్టుకోలేక, కన్నీటిని కార్చారు. దాని బిందువులు ప్రవక్త ముఖారవిందం పైన పడ్డాయి. ఆయన దిగ్గున లేచారు, విచారించారు. ఆయన చెప్పింది విని, ఆయన తన లాలాజలాన్ని పాము కాటు పైన పూసారు. అంతే, బాధా తగ్గిపోయింది, విష ప్రభావమూ మాయమయి పోయింది.

## కుబాలో ఆగమనం

మూడు రోజులు గుహలో గడిపి నాల్గవ రోజున మదీనా పవిత్ర నగరికి సౌర్ గుహ నుండి బయలుదేరారు. ఆ పైన ప్రయాణంలో కొండలూ లోయలూ ఎడారులూ దాటుకుంటూ మదీనాకు చేరువన కుబా గ్రామానికి దగ్గర చేరారు. అది గురువారం, దైవదౌత్యం తరువాత 13వ సంవత్సరం, రబీఉల్ అవ్వల్ 8వ తేదీ. క్రీ. శ. 622,సెప్టెంబర్ 20వ తారీఖు.

## కుల్సూమ్ బిన్ హదమ్ (ర)

అప్పటికే మదీనా, కుబా ప్రజలకు ప్రవక్త శ్రీ (స) విచ్చేసినట్లు సమాచారం అంది జనం తండోప తండాలుగా జనావాసానికి ఎంతో ముందుకు వచ్చి ఆహ్వానించారు. ఆ పైన వారంతా అతిథుల్ని తీసుకుని 'దైవమే గొప్ప వాడు' (అల్లాహు అక్బర్) అన్న నినాదాలతో ఓ పెద్ద ఊరేగింపుగా కుబా వైపునకు సాగారు. ఆ జనావాసం లోని ప్రజలు, దారికి ఇరువైపులా, మిద్దెల పైనా నిలబడి తమ ప్రియతమ ప్రవక్త (స) ను ఆనందంతో పాటలు పాడుతూ ఆహ్వానించారు. ఆయన జ్యోతిర్మయ ముఖం కూడా సంతోషంగా వెలుగుతోంది. కొంత దూరం వెళ్ళిన తరువాత ఓ పెద్ద ఆసామి ఇల్లు వచ్చింది. వాకిట నిలిచి ఉన్న ఇంటి యజమాని, కుల్సూమ్ బిన్ హదమ్ "అల్లాహు అక్బర్" అని నినదించారు. దైవ ప్రవక్త ఆయన ఆతిథ్యాన్ని స్వీకరించి అక్కడే ఆగారు.

కుబా చేరిన తరువాత ప్రప్రథమంగా ముస్లిములకు అత్యంత అవశ్యకం అయిన సామూహిక నమాజ్ కొరకు మస్జిద్, దానికి

తగిన స్థలాన్ని వెదకడానికి అబూ బక్ర్‌తో బయలు దేరారు ప్రవక్త శ్రీ (స). జనావాసానికి మధ్యన ఓ చదునయిన స్థలం కను గొన్నారు. అది ఆయన (స) ఆతిథేయుడు కుల్సూమ్ బిన్ హదమ్ గారిదే అని తెలిసింది. ముస్లిములు అందరితోపాటు ప్రవక్త శ్రీ (స) కూడా మస్జిద్ నిర్మాణంలో పాలుపంచుకున్నారు.

★★★

## 4.మదీనా పవిత్ర నగరిలో

అలా కుబాలో పద్నాలుగు రోజులు గడిపిన తరువాత జుమా రోజున ప్రవక్త శ్రీ (స) మదీనాకు బయలుదేరారు. దారిలో బనూ సాలిమ్ వీధికి చేరినప్పుడు జుమా నమాజ్ వేళ అయింది. కనుక ప్రవక్త (స) జుమా నమాజ్ ప్రకటన చేయించారు. అది తొల్దొలి జుమా నమాజ్, తొల్దొలి జుమా ఖుత్బా! అప్పటి వరకు అబూ బక్ర్, ప్రవక్తకు తోడుగా ఉన్నారు. తరువాత ప్రవక్త శ్రీ (స) మదీనాలో మహనీయ అబూ అయ్యూబ్ అన్సారీ ఇంట ఆతిథ్యం స్వీకరించగా అబూ బక్ర్, 'ఖారిజా' ఇంట ఉండిపోయారు. కొన్నాళ్ల తరువాత ఆయన బంధువు, మహనీయ తల్హాతో ఆయన కుటుంబ సభ్యులు రాగా, అబూ బక్ర్ తన స్వంత ఇల్లు కట్టుకున్నారు.

మదీనా వాతావరణం మక్కా నుండి వచ్చిన ముహాజిరులకు సరిపడలేదు. అనేకమంది తీవ్ర జ్వరంతో బాధపడి బలహీను లయి పోయారు. మహనీయ అబూ బక్ర్ కూడా అతి తీవ్ర జ్వరా నికి గురయ్యారు. తాను నయం కావడం కష్టమే అనుకున్నా రాయన. ఆయన కూతురు ఆయిషా(ర) ఆరోగ్యం గురించి విచా రించడానికి వచ్చినప్పుడు, ఆయన ఓ కవిత వినిపించారు, అర్థం:

"ప్రతి వ్యక్తి తన ఇంటి వారలతో తెల్లవారు లేవగా మృత్యువు అతని చెప్పుల వారు కన్నా చేరువగా ఉంటుంది!"

కూతురు కన్నీటి పర్యంతం అయ్యారు. ఆమె బాధ పడుతూ వెంటనే ప్రవక్తశ్రీ వద్దకు వెళ్లి తండ్రి స్థితి వివరించారు. దైవ ప్రవక్త తన అత్యుత్తమ సహచరుడు, గుహమిత్రుని అనారోగ్యం గురించి వినగానే సకల శుభాల ప్రభువు సమక్షంలో చేతులెత్తి అర్థించారు:

"ప్రభూ! మక్కా లానే మదీనా పట్లనూ ప్రేమ మా హృదయాల్లో నింపి వెయ్యి.

మదీనాను వ్యాధుల నుంచి పరిశుద్ధపరచు. మదీనా వ్యాధుల్ని మరెటయినా పార ద్రోలు!!"

దైవ కారుణ్యం తన ప్రియ ప్రవక్త అర్థింపును వృధా పోనిస్తుందా? కోరింది ప్రదానమయింది! అబూ బక్ర్ ఆరోగ్య వంతులయి లేచారు. మదీనా వాతావరణం మక్కా వారి కొరకు సానుకూల మయిపోయింది!!

## సోదరత్వం

మక్కా నుంచి మదీనా వచ్చిన ముహాజిరులకు వారికి మదీనాలో ఆశ్రయం కల్పించిన అన్సారులకూ మధ్యన సోదరత్వం కల్పిం చారు ప్రతి ఒక్కరి మనస్తత్వాలు బాగా ఎరిగిన ప్రవక్త శ్రీ (స). మహనీయ ఖారిజా అన్సారీకి మహనీయ అబూ బక్ర్‌కి మధ్యన సోదరత్వం కల్పించారు ఆయన (స).

మహనీయ అబూ బక్ర్(ర), ప్రవక్త శ్రీ(స)తో పాటు, ఆయన నిర్వహించిన ప్రతి వ్యవహారంలోను, మక్కాలోనయినా మదీనాలో నయినా, పూర్తిగా పాల్గొన్నారు, సలహాలిచ్చారు, వాటిని విజయవంతంగా అమలు జరిపారు. సాధారణంగా ముస్లిములు ఏదయినా సమస్య ఎదురయినప్పుడు ప్రవక్త శ్రీ (స) తరువాత అధికంగా అబూ బక్ర్ (ర)నే సంప్రతిస్తారు. తమ కష్ట సుఖాలు ఆయనతో పంచుకుంటారు. ఆయన కూడా వారి అవసరాలను తీర్చేందుకు శాయశక్తులా యత్నిస్తారు. తనవల్ల కాకపోతే మరీ పెద్ద వ్యవహారాలు ప్రవక్త మహనీయుల వద్దకు తీసుకువెళ్ళేవారు.

మదీనాలో మస్జిద్ కొరకు భూమి కొనవలసిన సమయం వచ్చి నప్పుడు భూమి ఇద్దరు అనాథ బాలలకు చెందినది అని తెలియగా దాని వెల పది దీనారులుగా నిర్ణయించారు ప్రవక్త శ్రీ, ఆ రొక్కం అబూ బక్ర్ తన వద్ద నుంచి చెల్లించారు. ఆ భూమి మీదనే నేడు ప్రవక్త మస్జిద్, ప్రవక్త చివరి బస పచ్చ గుమ్మటం దర్శనమిస్తుంటాయి! దాని నిర్మాణంలోనూ అందరితో పాటు ఆయనా ప్రవక్త శ్రీ (స) ఆచరణాత్మకంగా పాల్గొన్నారు.

## బద్ర్ మైదానంలో

మక్కాలో కురైష్ ప్రజలకు, మదీనాలో ముస్లిములు ఓ పటిష్ఠ సమాజంగా ఏర్పడటం కంటగింపుగా రూపొందింది. ముస్లిములు మక్కా వదలిపోయినప్పటి నుంచి వారు లోలోనే ఏ విధంగా నయినా ముస్లిములను తుద ముట్టించాలని, ప్రయత్నాలూ పన్నాగాలు చేస్తూనే ఉన్నారు. కడకు హిజ్రత్ రెండవ సంవత్సరం, రమజాన్ నెలలో వెయ్యిమంది సేనను ఉతబా నాయకత్వంలో మదీనా మీదికి దాడి జరపడానికి సమాయత్తమయి వచ్చారు.

ప్రవక్త మహనీయులకు కురైష్ విష పన్నాగాల సమాచారం ఎప్పటికప్పుడు అందుతూనే ఉంది. ఆయన (స) సహచర మాన్యుల ఓ మహాసభ ఏర్పరిచారు. అప్పుడు మహనీయ అబూ బక్ర్ పరిస్థితుల గంభీరతను విశదం చేసి ఇది ధన ప్రాణాలు త్యాగం చేయవలసిన తరుణం అని బోధించారు. హిజ్రీ 2వ సంవత్సరం రమజాన్ నెల 12వ తేదీన 313 మంది త్యాగధను లయిన ముస్లిమ్ యోధులతో బయలుదేరి, ఎనభై మైళ్ళు నడచి 16వ తేదీన బద్ర్ ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే కురైషీలు ఆ లోయకు ఆవలి ఒడ్డున చేరారని తెలుసుకుని అక్కడే క్యాంపు వేశారు ప్రవక్త శ్రీ.

ఆ మైదానంలో ప్రవక్త మహనీయుల కొరకు ఓ చిన్న వసారా లాంటిది వేశారు. దాని కాపుదల, రక్షణ భారం, మహనీయ అబూ బక్ర్ ముందుకు వచ్చి తన భుజాన వేసుకున్నారు. మరుసటి రోజు ఫజ్ర్ తరువాత సేన విభజన వారి నాయకుల నిర్ణయం తదితర అంశాలను అబూ బక్ర్ సిద్దీక్‌కే కేటాయించారు ప్రవక్త శ్రీ. బాగా తెల్లవారిన తరువాత సేన వరుసలను తాను స్వయంగా తీర్చిదిద్దారు.

అది అతి విచిత్రమయిన దృశ్యం. ఒక వైపున వెయ్యి మంది బహుదైవారాధకులు, సకల విధాల ఆయుధాలతో, ఉక్కు కవచాలు, శిరస్త్రాణాలు, ధరించి, వందకు పైగా గుర్రాలతో మైదానంలో ఛాలెంజ్ చేస్తూ ఉన్నారు. మరో వైపున 313 మంది ముస్లి ములు, దాదాపు నిరాయుధులయిన వారు, కేవలం దైవ వచన సమున్నతి కొరకు త్యాగధనులయిన వీరులు! ఇదంతా గమనించి దేవుని అంతిమ సందేశహరులు (స) దైవసన్నిధిలో తల నేలపై ఆనించి వేడు కోలులో మగ్నమయి పోయారు :

"ప్రభూ! విజయం ప్రదానం చేసే నీ వాగ్దానం నెరవేర్చు అని వేడుకుంటున్నాను ప్రభూ!! నేడు ఈ పిడికెడు మంది దైవ దాసులు సమసిపోతే జగతిలో నీ దాస్యం చేసే జనం, నీ వచనాన్ని సమున్నత పరిచే వారు మరెవరూ మిగులరు, స్వామీ!"

ఇది విని మహనీయ అబూ బక్ర్ (ర) ఆయన చెయ్యి పట్టుకుని, "చాలు, ప్రవక్తా! ఇక చాలు, దైవం తన వాగ్దానాన్ని తప్పక నెరవేరుస్తాడు, లేవండి!" అని ఓదార్చారు. ఆ మాటలకు ప్రవక్త శ్రీ తల పైకెత్తి, "తిరస్కారులు చిందువందు అయిపోతారు, వెనుతిరిగి పారిపోతారు" అంటూ లేచారు.

రణరంగం వేడెక్కింది మహనీయ అబూ బక్ర్ చూశారు, ఆయన కుమారుడు అబ్దుర్రహ్మాన్ మక్కా సేనలో కురైష్ తరపున పోరాడుతూ కనిపించారు. ఆయన ఆగ్రహంతో ఉడికి పోయారు, వెంటనే ఔస్ తెగ నాయకత్వ ధ్వజం, మహనీయ సఅద్ బిన్ ముఆజ్ నుండి మార్పించి ఉసైద్ బిన్ హుజైర్‌కు అప్పగించారు, సఅద్ బిన్ ముఆజ్‌కు తన బాధ్యతల నప్పగించి తాను స్వయంగా అబ్దుర్రహ్మాన్ వైపునకు లంఘించారు. ఆయన అతని పై దెబ్బ తీయాలని అనుకున్నంతనే అతను పారిపోతూ, "నాన్నగారూ! మీ హృదయం బండబారిందా?" అని అరిచాడు. "అవును, తిరస్కారుల కొరకు మరీ కఠినం" అని బదులిచ్చారు!

ఆ పోరులో పద్నాలుగు మంది ముస్లిములు అమరగతి నొందగా, బహుదైవారాధకులు 70 మంది పట్టుబడ్డారు, 70 మంది హతులయ్యారు. ప్రవక్త శ్రీ (స) ఖైదీలను గురించి సహచరుల్ని సంప్రతించారు. మహనీయ అబూ బక్ర్ వారిని వదలి వేయాలని, మహనీయ ఉమర్ వారిలో ఎవరినీ వదలకుండా అందరినీ సంహరించాలని సలహా ఇచ్చారు. కారుణ్య మూర్తి, అబూ బక్ర్ సలహాను పాటించారు, కాని దైవానికి ఈ నిర్ణయం నచ్చ లేదు!

## ఉహుద్ మైదానంలో

కురైషులు బద్ర్‌లో జరిగిన పరాభవాన్ని జీర్ణించుకోలేకపోయారు. దాని ప్రతీకారాగ్ని వారిని నిలువ నివ్వ లేదు. వారు తెగలన్నింటిలో దాన్ని రగుల్గొలిపేందుకు ఉద్యమంలా కృషి సలిపారు. అందరినీ సమరయోధుల్లా సమాయత్త మయ్యేందుకు పురికొలిపారు. ఈ విధంగా వారు మూడు వేల సిపాయిల సేన సిద్ధ పరిచారు.

మరుసటి సంవత్సరమే, అంటే హిజ్రీ 3వ సంవత్సరం, షవ్వాల్ నెల, క్రీ. శ. 624, మార్చి నెలలో ఈ సేన ముస్లిములను తుద ముట్టించడానికి మక్కా నుండి బయలుదేరింది. నాయకులందరూ తమ వెంట తమ అర్ధాంగులను, కూతుళ్ళను సయితం తీసుకు వచ్చారు, వారున్నూ ముస్లిముల కళేబరాలను, గత ఏడాది వారి తండ్రులనూ, సోదరుల్నీ, బంధుగణాన్నీ చంపిన వారి కళేబరాలను కళ్ళారా చూడాలని!

ఆ సందర్భంలో, మదీనా నగరం నలువైపులా కొన్ని ముఖ్య స్థానాల్లో కాపలాదారుల్ని నియమించారు దైవ సందేశహరులు. సమస్త యోధులతో పాటు మహనీయ అబూ బక్ర్ కూడా ఒక స్థానానికి ఓ రాత్రి మొత్తం కాపలా కాసారు.

హిజ్రీ 3వ సంవత్సరం, షవ్వాల్ నెల 14వ తారీఖున, (అంటే క్రీ. శ. 624, మార్చి 29న), జుమా నమాజ్ తరువాత బయలుదేరి మదీనా నుండి నాలుగు మైళ్ళు వచ్చి ఉహుద్ కొండ తమకు వెనక ఉన్నట్లుగా క్యాంపు వేశారు ప్రవక్తశ్రీ (స). అప్పుడు ముస్లిముల సంఖ్య ఏడు వందల కన్నా తక్కువే. వీరు మూడు వేల సేనను ఎదుర్కొని వీరోచితంగా పోరాడారు - తమ ధర్మాన్నీ ధార్మిక జీవితాన్నీ కాపాడుకునేందుకు!

ఆ పోరులో పలువురు ముస్లిమ్ యోధులు అనన్య రీతిలో పోరాడి తిరస్కారుల పైన బాగా ఒత్తిడి పెంచారు. తిరస్కారుల సేన కమాండర్లు అనేకమంది ఒక్కొక్కరే హతులవ సాగారు. తిరస్కారుల ఓ పెద్ద యోధుడు పడిపోగానే వారు వెనుదిరిగారు పారిపోసాగారు. ముస్లిమ్ యోధులు శత్రువు పారిపోయాడన్న భ్రమతో వారు వదిలిపోయిన అస్త్రాలు, ఇతర సామగ్రి ప్రోగు చేయడంలో నిమగ్నమయ్యారు. ఇది గమనించి పారిపోతున్న గుర్రంస్వారీ చేసే శత్రువులు తిరిగి రణరంగం వైపునకు మరలి వచ్చారు. తిరిగి వచ్చిన శత్రువుకు తట్టుకోలేక ముస్లిములు చిందువందయి పోయారు.

ప్రవక్త మహనీయుల వద్ద పదకొండు మంది సైనికులే మిగిలారు. కాని ఒక్కసారిగా ప్రవక్త కొరకు ప్రాణత్యాగానికి వెరవని సన్నిహిత సహచరులు నలువైపుల నుండి పరుగిడి ఆయన చుట్టూచేరారు. కడకు ఓ మహిళ, ఉమ్ము అమ్మారా కూడా అతి సున్నితమయిన ఆ సమయాన్ని గమనించి వచ్చి శత్రువులపై తన ఖడ్గంతో లంఘించసాగారు. ప్రాణ విదారకమయిన ఆ సమయాన ప్రవక్త ప్రియ సహచరులు తమ ప్రియతమ నాయకుని కాపాడడమే కాక శత్రువుల్ని సయితం పలాయనం చిత్తగించేలా తెగించి పోరాడారు.

అదే అదునుగా మహనీయ అబూ బక్ర్ ప్రవక్త శ్రీని తీసుకుని కొండ మీదికి వెళ్ళి పోయారు. అలా ప్రవక్త శ్రీని రక్షించడంలో ఆయనకు మహనీయ తల్హా తోడ్పడ్డారు. మిగతా ముస్లిములు కూడా పైకి వచ్చేశారు. అప్పుడు శత్రు సేనలో ఉన్న అబూసుఫ్యాన్ కొండ దగ్గరగా వచ్చి అరిచాడు, "మీ మధ్యన ముహమ్మద్ ఉన్నారా?" అని. సమాధానం రాకపోవడంతో అబూసుఫ్యాన్, అతని సిపాయిలు పైకి ఎక్కే ప్రయత్నం చేశారు, పై నుంచి అబూ బక్ర్, ఉమర్ తదితరులు బండలు దొర్లించారు. అంతే, వారు పైకెక్కే సాహసం చేయలేదు. మరుసటి రోజు ముస్లిములు మదీనాకు తిరిగి వచ్చేశారు. ❑

# మాటలకే పరిమితమైన మైనార్టీల సంక్షేమం!

- యండి.ఉస్మాన్ ఖాన్



**భారతదేశం** ఒక ప్రజాస్వామ్య, సెక్యులర్ దేశం. ఇక్కడ పౌరులందరికీ సమాన హక్కులూ, అవకాశాలు లభ్యం కావాలి. ఏ ఒక్కరిపట్ల వివక్ష, పక్షపాతం ఉండకూడదు. దేశంలో న్యాయం, ధర్మం అమలవుతున్నాయనడానికి ఇది నిదర్శనం. కాని పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆ పరిస్థితి లోపించింది. గత ఏడున్నర దశాబ్దాలుగా దేశంలోని ఒక పెద్ద మైనారిటీ వర్గం అన్యాయానికి, వివక్షకు, అవకాశాల లేమికి గురవుతూ ఉంది. బడుగు బలహీన వర్గాలు, ముఖ్యంగా ముస్లిం మైనారిటీల పరిస్థితి 'గొర్రెకు బెత్తెడు తోక' సామెతను తలపిస్తోంది. ఏడున్నర దశాబ్దుల కాలమంటే చిన్న విషయం కాదు. ఈ కాలంలో దేశం అనేక రంగాల్లో మంచి అభివృద్ధిని సాధించింది. కాని ముస్లిం సముదాయానికి మాత్రం స్వాతంత్ర్య ఫలాలు ఇంకా అందని ద్రాక్షలుగానే మిగిలి పొయ్యాయి. ఇంతటి సుదీర్ఘ స్వతంత్ర భారతంలో పేదలు, బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు లభిస్తున్నాయా? అన్నది సమాధానం కోసం తడుముకోవాల్సిన ప్రశ్న. ఎందుకంటే, గత డెబ్భయ్యేళ్ళకు పైగా ఒక పెద్దమానవ సమూహం మనదేశంలో వివక్షకు, అన్యాయానికి, అవకాశాల లేమికి, పీడనకు, హక్కుల ఉల్లంఘనకు గురవుతూ ఉంది. దేశ స్వాతంత్ర్యం కోసం అన్ని వర్గాల ప్రజలు ప్రాణాలకు తెగించి పోరాడారు. అందులో ఈ దేశ మూలవాసులైన ముస్లిమ్ మైనారిటీల పాత్ర అమోఘం, చిరస్మరణీయం. మాతృభూమి విముక్తి కోసం ప్రాణాలను పణంగా పెట్టి, బ్రిటిష్ ముష్కరులతో తలపడిన ముస్లిమ్ వీరులు చరిత్రలో మనకు కోకొల్లలుగా కనిపిస్తారు. అసంఖ్యాక మంది త్యాగధనుల అసామాన్య, అనుపమాన బలిదానాల ఫలితంగా భారత దేశం దాస్య శృంఖలాలను తెంచుకొని స్వేచ్ఛా విహంగంలా శాంతి, సామరస్యాల నాగరికతను పుణికి పుచ్చుకొని లౌకిక, ప్రజాస్వామ్య గమ్యం వైపునకు ప్రస్థానం చేసింది. నిజానికి పరాయి బానిసత్వం నుండి విముక్తి పొందిన తరువాత ప్రజల జీవితాలు మారిపోవాలి. వారి జీవన ప్రమాణాలు అనూహ్యంగా మెరుగు పడాలి. అన్నిటికీ మించి వారి ఆత్మ విశ్వాసానికి ఆకాశమే హద్దు కావాలి. కాని మన దేశంలోని ఒక పెద్ద రెండవ మెజారిటీ వర్గమైన ముస్లిముల పరిస్థితి అలాలేదు. 'గొర్రెకు బెత్తెడు తోక' చందంగా వారి అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్నట్లుంది. వారి జీవన ప్రమాణాల్లో చెప్పుకోదగిన మార్పులేవీ అంతగా సంభవించలేదు. ఆత్మన్యూనత, అభద్రతా భావం వారిని వెంటాడుతూనే ఉంది. అనుమానపు దృక్కులు వారిని చిత్రవధ చేస్తూనే ఉన్నాయి. తినే తిండి, తొడిగే బట్ట విషయంలో కూడా స్వతంత్రత లేకుండా పోతున్నది. మూకదాడులు, ఆస్తుల విధ్వంసంతో పోయినవారి ప్రాణాలు పోగా, మిగిలినవారి జీవితాలు దుర్భరమౌతున్నాయి.

అసలే పేదరికంతో మగ్గుతున్న జాతికి ఇది గోరుచుట్టుపై రోకటి పోటు. ఈనాటికీ దేశ ముస్లిమ్ జనాభాలో అరవై శాతం మంది ప్రజలు దారిద్ర్య రేఖ దిగువన దుర్భర జీవనం గడుపుతున్నారంటే పరిస్థితిని అర్ధం చేసుకోవచ్చు. అత్యధిక శాతం మందికి సరైన జీవనోపాధి అవకాశాలు లేవు. కూడు, గూడు, గుడ్డ అన్న కనీస రాజ్యాంగ హామీ కూడా వీరికి వర్తించడం లేదు. అక్షరాస్యతా శాతం అతి హీనం. ఉన్నత స్థాయి విద్యనభ్యసించిన వారిని, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారిని, చట్ట సభల్లో కాలు మోపిన వారిని వేళ్ళపై లెక్కించవచ్చు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకాలూ వారికి అందవు. ఎన్నో కమిటీలు, కమీషన్లు వారి జీవన స్థితి గతుల్ని, వారి వెనుక బాటును, దాని కారణాలను వివరంగా తెలియ జేశాయి. సమస్యల పరిష్కారానికి సూచనలూ, వారి సంక్షేమానికి చేపట్టవలసిన చర్యలనూ సిఫారసు చేశాయి. జస్టిస్ గోపాల్ సింగ్ కమిషన్ మొదలు జస్టిస్ రాజేందర్ సచార్ కమిషన్ వరకు దేశంలోని ఇతర అన్నివెనుక బడిన వర్గాలకంటే ముస్లిమ్ నముదాయం మరింత వెనుకబాటుకు, అణచి వేతకు, అవకాశాల లేమికి గురై ఉందన్న పచ్చినిజాన్ని వెల్లడించాయి. ఈ దుస్థితికి ప్రధాన కారణం పాలక వర్గాలే అన్నది జగమెరిగిన సత్యం. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొని అన్ని పార్టీలూ లబ్ది పొందాయి. కేవలం గాలి మాటలే తప్ప, చేతల్లో ఎక్కడా మైనారిటీల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉన్నట్లు కనబడదు. ఈ కమిటీలు, కమీషన్లన్నీ కేవలం మభ్యపెట్టడానికి, ఓటు బ్యాంకు దారి మళ్ళకుండా కాపాడుకోడానికి తప్ప మరొకటి కాదన్న విషయం దీని ద్వారా స్పష్టంగా అర్ధమౌతోంది. ఎందుకంటే జస్టిస్ సచార్ కమిటీ తన నివేదిక సమర్పించి కూడా దశాబ్దంన్నర కాలం గడిచి పోయింది. నిజానికి దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయబద్ధంగా, రాజ్యాంగ పరంగా వారికి లభించ వలసిన హక్కులు, అవకాశాలు, అభివృద్ధి ఫలాలు లభించినప్పుడే 'స్వతంత్ర భారత'భావనకు పరిపూర్ణత చేకూరుతుంది. 'దేశ స్వాతంత్ర్య ఫలాలు, సమాన అవకాశాలు అందరికీ' అన్న రాజ్యాంగ హామీకి సార్ధకత సిద్ధిస్తుంది. అలా కాకుండా దేశంలోని ఏ ఒక్క వర్గం ప్రజలైనా వివక్షకు, పక్షపాతానికి, అణచివేతకు, అవకాశాల లేమికి, న్యాయ నిరాకరణకు గురైతే దేశం ప్రగతీ వికాసాల బాటలో పయనించడం, నాగరిక లక్షణాలతో విలసిల్లడం అసాధ్యం. కనుక, పాలక పక్షాలు ఇప్పటికైనా స్పందించి దేశ ప్రజలకు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీ, బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ రాజ్యాంగం కల్పించినటువంటి హక్కుల్ని వారికి అందించాలి. దేశంలోని ఇతర వెనుకబడిన వర్గాల వారి వృద్ధీవికాసాల కోసం ఏ రకమైన చర్యలు చేపట్టడం జరుగుతుందో, అలాంటి చర్యలనే మైనారిటీల సంక్షేమం కోసం చేపట్టాలి. ముస్లిమ్ సముదాయానికి వారి జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ, పంచాయితీ మొదలు పార్లమెంటు వరకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి. ముస్లిముల సంక్షేమానికి అరకొర నిధులు విదల్చడం కాకుండా ప్రత్యేకంగా సమగ్ర బడ్జెట్ కేటాయించాలి. ఎస్సీ, ఎస్టీలకు అత్యాచార నిరోధక చట్టం ఉన్నట్లుగానే, ముస్లిమ్‌ల కోసం కూడా అత్యాచార నిరోధక చట్టం తీసుకురావాలి. సబ్ ప్లాన్ అమలు చేయాలి. మైనారిటీ కార్పొరేషన్, మైనారిటీ ఎడ్యుకేషన్ బోర్డు, ముస్లిమ్ పర్సనల్‌లా, ఉర్దూ అకాడమీ, వక్ఫ్ బోర్డుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే అన్యాక్రాంతమైపోయిన వక్ఫ్ భూములు, ఇతరేతర ఆస్తుల్ని కబ్జా దారులనుండి తిరిగి రాబట్టాలి. లేని పక్షంలో, ఉన్నఆస్తుల్ని రక్షించలేక పోయినందుకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహిస్తూ ముస్లిములకు నష్టపరిహారం చెల్లించాలి. విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలన్నింటిలో ముస్లింలకు సముచితమైన, చట్టబద్ధమైన అవకాశాలు, ప్రాతినిధ్యం కల్పించాలి. దేశం పట్ల, దేశ ప్రజల పట్ల, అందులో భాగమైన మైనారిటీల పట్ల ఏమాత్రం బాధ్యత ఉన్నా కనీసం జస్టిస్ సచార్ సిఫారసులనైనా తక్షణం అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. తెలంగాణలో ఉర్దూను రెండవ అధికార భాషగా అమలు చేస్తామన్న వాగ్దానాన్ని బియ్యారెస్ ప్రభుత్వం ఆచరణలో పెట్టాలి. 12 శాతం రిజర్వేషన్ల హామీ ఏ గాలికి కొట్టుకు పోయిందో చెప్పాలి. ఈ విషయమై ముస్లిం నాయకత్వ జెండా మోస్తున్నామని చెప్పుకునేవాళ్ళు కేసీఆర్‌ను ప్రశ్నించాలి. నిలదీయాలి. ఒత్తిడి తీసుకురావాలి. ముస్లిమ్ సముదాయం కూడా ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా రాజ్యాంగ ప్రసాదితమైన తమ హక్కుల సాధనకు రాజ్యాంగ బద్ధంగానే పోరాడాలి. పాలక పక్షాలు చురుగ్గా స్పందించేలా దేశంలోని ప్రజాస్వామ్య ప్రియులు, హక్కుల నేతలు, లౌకిక వాదులు, వామపక్షీయులు, బహుజన శక్తులతో కలిసి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావాలి. ప్రజాస్వామ్య శక్తులు, భావ సారూప్యత కలిగిన వ్యక్తులు, సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌర సమాజం సహకారంతో ముస్లిమ్ నేతలు, సంఘాలు ఐక్య కార్యాచరణ రూపొందించుకొని ఉద్యమాలకు పూనుకోవాలి. భాధిత వర్గాల్లో చైతన్యం రానంతకాలం పాలక పక్షాలు వారిని ఓటు బ్యాంకులుగానే పరిగణించి చిన్నచిన్న తాయిలాలతోనే సంతృప్తి పరిచే ప్రయత్నాలు చేస్తుంటాయి. కనుక చైతన్యంతో కార్యాచరణ రూపొందించుకొని సాధన దిశగా ముందుకు సాగాలి. ❖

**తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**53 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 42. అష్ షూరా

15 ఈ పరిస్థితి ఎలాగూ నెలకొన్నది గనుక ముహమ్మద్, ఇక నీవు ఆ ధర్మం వైపునకే పిలుపు నివ్వు. నీకు ఆదేశించిన విధంగా దాని మీదనే పటిష్టంగా స్థిరపడు, ఈ జనుల కోరికలను అనుసరించకు, వీరికి చెప్పివెయ్యి, "అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథం ఏదయినా నేను దాన్ని విశ్వసిస్తున్నాను.[27] మీ మధ్యన న్యాయం చెయ్యాలని[28] నన్ను ఆదేశించడమయినది. అల్లాహ్ మటుకే మా ప్రభువూ మీ ప్రభువు కూడా. మా ఆచరణలు మాకూను, మీ ఆచరణలు మీకే వర్తిస్తాయి.[29] మాకూ మీకూ మధ్య ఎటువంటి వాదులాట లేదు.[30] అల్లాహ్ ఒక రోజున మనలనందరినీ ఏకత్రం చేస్తాడు, మరాయన వైపునకే అందరూ వెళ్ళవలసి ఉంది."

27. మరో మాటలో చెప్పాలంటే నేను, వారిలా దైవం పంపిన కొన్ని గ్రంథాలను నమ్మేవాణ్ణీ, మరికొన్నింటిని నమ్మని వాణ్ణీ కాను. దైవం పంపిన ప్రతి గ్రంథాన్ని నేను నమ్ముతున్నాను.

28. ఈ సమగ్రమయిన వాక్యానికి ఎన్నో భావాలు వస్తాయి: ఒకటి, నేను ఈ సమస్త వర్గబద్ధతలకు వేరుగా ఉంటూ నిష్పక్ష పాతంతో న్యాయప్రియతను అవలంబించేందుకు నియమ బద్ధుణ్ణి. ఒక వర్గం పట్ల అనుకూలంగాను, మరో వర్గానికి వ్యతిరేకంగాను వివక్ష చూపడం నా పని కాదు. నాకు సకల మానవులతో సమానమయిన సంబంధముంది. అది ఆసాంతం, సత్యం, న్యాయాల సంబంధం. ఎవరి ఏ మాట సత్యమయిన దయితే నేనతనికి తోడుగా ఉంటాను, అతను పరాయికన్నా పరాయివాడయినా సరే. మరెవరి మాట సత్యవిరుద్ధమో నేనతనికి వ్యతిరేకిని, అతను నాకు ఆప్తబంధువయినప్పటికీ.

రెండవ అర్థం ఏమిటంటే, ఏ సత్యాన్నయితే మీ సమక్షంలో పెట్టడానికి నేను నియుక్తుణ్ణి అయ్యానో అందులో ఎవరికీ ఎటువంటి ప్రత్యేకత లేదు, అది అందరికీ సమానమే. ఇందులో తనవారు, పరాయివారు, పెద్దలు, పిన్నలు, నిరు పేదలు, ధనికులు, శ్రేష్ఠులు, అధములు అన్న తేడా ఏమీ లేదు. వీరికి వేర్వేరు హక్కుల్లేవు, ఉన్నదంతా అందరికీ ధర్మమయినదే, మరేదయితే పాపమో అందరికీ పాపమే. అధర్మమయింది అందరికీ అధర్మమయినదే, నేరమయినది అందరికీ నేరమే. ఈ నిష్పక్షపాతమయిన నియమంలో నాకూ వ్యక్తిగతంగాను ఎటువంటి మినహాయింపు లేదు.

మూడవ భావం, నేను ప్రపంచంలో న్యాయస్థాపనకు నియు క్తుణ్ణి. ప్రజల మధ్య న్యాయం చేకూర్చే బాధ్యత నాకు అప్పగించ బడింది. మీ జీవితాల్లోనూ, మీ సమాజంలోనూ నెలకొన్న అసంతులనాలను, అన్యాయాలను అంతమొందించాలన్నది నా బాధ్యత.

ఈ మూడు అర్థాలేకాక ఈ వాక్యానికి మరో నాల్గవ భావం కూడా ఉంది. అది మక్కా పుణ్యపురిలో కాక మదీనా పవిత్ర నగరిలో హిజ్రత్ తరువాత వెల్లడయింది. అదేమిటంటే నేను దైవం నిర్ణయించిన న్యాయమూర్తిని, కాజీని. మీ మధ్య న్యాయం చేయడం నా బాధ్యత.

29. అంటే, మనలో ప్రతి ఒక్కడు తన ఆచరణలకు స్వయంగా జవాబుదారు, బాధ్యుడు. మీరు సత్కార్యం చేస్తే దాని సత్ఫ లితం మాకు అందదు, మీరే దాన్ని అనుభవిస్తారు. మేము తప్పు చేసినట్లయితే దాని శాస్తిగా మీరు పట్టుబడరు, మేము స్వయంగానే దాని దుష్ఫలితాన్ని అనుభవించవలసి ఉంటుంది. ఇదే విషయాన్ని లోగడ కూడా సెలవీయడం జరిగింది. (చూడండి, ఖుర్ఆన్ అవగాహనం, సం.1, అల్ బకర: ఆయత్ 139; సం.3, యూనుస్: ఆయత్ 41; హూద్: ఆయత్: 35; సం.6, అల్ కసస్: ఆయత్: 55).

30. అంటే, హేతుబద్ధమయిన, సమంజసమయిన ఆధారాలతో బోధపరచడమయితే మా బాధ్యతగా మేము నెరవేర్చాము. ఇక అనవసరంగా నువ్వంటే నువ్వని, నేనంటే నేనని వాదులాడుకోవడం వల్ల ప్రయోజనమేమిటీ, మీరు జగడానికి దిగినా మేము దానికి సిద్ధంగా లేము.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

## 3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

**314)** మహాప్రవక్త పవిత్ర సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ) వివరించారు: దైవప్రవక్త(సఅసమ్) పరమపదించిన సమయంలో హజ్రత్ అబూబక్ర్(రజి) 'సునహ్' వాడలో ఉన్నారు. (అది మస్జిదె నబవీకి ఒక మైలు దూరంలో ఉంది). ఉల్లేఖకులలో ఒకరైన ఇస్మాయీల్ ప్రకారం 'అవాల్' అనే పేటలో ఉన్నారు.

దైవప్రవక్త(స) మరణవార్త వినగానే హజ్రత్ ఉమర్ చివాలున లేచి, 'దైవ సాక్షిగా! దైవప్రవక్త(స) మరణించటమా? అసంభవం' అన్నారు. హజ్రత్ ఆయిషా (ర) కథనం ప్రకారం హజ్రత్ ఉమర్(రజి) ఇలా అంటూ ఉండేవారు: 'దైవసాక్షి! ఆ క్షణంలో నా మదిలో కలిగిన ఆలోచన అదే. అల్లాహ్ ఆయన(స)కు ఈ వ్యాధి నుండి తప్పక స్వస్థతను ప్రసాదిస్తాడని అనుకున్నాను. (ప్రవక్త మరణం గురించి వదంతులు వ్యాపింపజేస్తున్న) వారి కాళ్ళు చేతుల్ని ఆయన(స) నరికివేస్తారని కూడా ఊహించాను'. అంతలో హజ్రత్ అబూబక్ర్(రజి) వచ్చారు. ఆయన ప్రవక్త నివాస గృహంలోనికి వెళ్ళి, దైవప్రవక్త(స) పార్థీవ శరీరంపైనున్న గుడ్డను తొలగించి ముద్దు పెట్టుకున్నారు. ఇలా అన్నారు: 'నా తల్లిదండ్రులు మీకు అర్పితం. మీరు జీవించి ఉన్న కాలంలో కూడా పవిత్రంగా ఉన్నారు. మరణం తరువాత కూడా పవిత్రంగానే ఉన్నారు.ఎవరి స్వాధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! అల్లాహ్ మీపైన రెండుసార్లు మరణం విధించడు'- ఆ తరువాత ఆయన బయటికి వచ్చి ఉమర్ (రజి)తో, 'ఒట్టేసుకుంటున్నవాడా! కాస్త నెమ్మదించు' అన్నారు. దాని మీదట సంభాషణ మొదలెట్టారు. దాంతో హజ్రత్ ఉమర్(రజి) నిశ్శబ్దంగా ఉండిపోయారు.

హజ్రత్ అబూబక్ర్(రజి) మొదట అల్లాహ్ స్తోత్రం చేశారు. తరువాత ఇలా అన్నారు: 'ప్రజలారా! చూడండి, ఒకవేళ ఎవరయినా ముహమ్మద్(సఅసమ్)ను ఆరాధించే మాటైతే, ముహమ్మద్(స) మరణించారన్న సంగతి వారికి తెలియాలి. ఎవరయినా అల్లాహ్‌ను ఆరాధిస్తున్నట్లయితే, అల్లాహ్ సజీవుడు, ఆయనకు ఎన్నటికీ మరణం రాదు. (పిదప అబూబక్ర్-రజి జుమర్ సూరాలోని ఈ ఆయత్‌ను పఠించారు) 'ఓ ప్రవక్తా! నీవూ మరణిస్తావు. వారు కూడా మరణించవలసిన వారే'(39: 30). ఇంకా అల్లాహ్ ఏమని సెలవిచ్చాడంటే, 'ముహమ్మద్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కాదు. అతనికి పూర్వం కూడా ఎందరో ప్రవక్తలు గతించారు. అలాంటప్పుడు అతను ఒకవేళ మరణిస్తే లేక హత్య చెయ్యబడితే మీరు వెనుకంజ వేసి మరలిపోతారా? జ్ఞాపకం ఉంచుకోండి, మరలి పోయేవాడు అల్లాహ్‌కు ఎలాంటి నష్టం కలిగించలేడు. కాని అల్లాహ్‌కు కృతజ్ఞత చూపే దాసులుగా జీవించేవారిని, ఆయన తగువిధంగా బహూకరిస్తాడు' (3: 144). ఇది విని జనులు ఎక్కి ఎక్కి ఏడ్చారని ఉల్లేఖకుడు తెలిపారు. ఉల్లేఖకుని ప్రకారం అన్సార్లు 'సఖీఫా బనీ సాయిదా'లో సాద్ బిన్ ఉబాదా (రజి) వద్ద సమావేశమై 'ఒక అమీర్ (నాయకుడు) మాలో నుంచి, మరో అమీర్ మీలో (ముహాజిర్లలో) నుంచి ఉండాలి' అని కోరారు. (అంటే ఇద్దరూ కలసి పరిపాలన చేయాలి). అంతలో అబూబక్ర్, ఉమర్, అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (రజిఅల్లాహు

అన్‌హుమ్) అక్కడకు చేరుకున్నారు.

ఉమర్(రజి) సంభాషణ మొదలెట్టబోయారు. కాని అబూబక్ర్(రజి) ఆయ నకు అడ్డు తగులుతూ, నిశ్శబ్దంగా ఉండమని చెప్పారు– ఉమర్ ఇలా అనేవారు: దైవసాక్షి! నేనలా చేయడానికి కారణమేమంటే, నేను ముందుగానే నాకెంతో ఇష్టమైన ప్రసంగాన్ని తయారు చేసుకుని ఉన్నాను. అయినప్పటికీ అబూబక్ర్(రజి)కి సమ ఉజ్జీ కావడానికి ఈ ప్రసంగం సరిపోదని భయపడ్డాను. ఎట్టకేలకు అబూబక్ర్(రజి) గంభీరంగా మాట్లాడటం మొదలెట్టారు. ఆయన తన ప్రసంగంలో ఇలా అన్నారు: "(ఖురైషులైన) మేము పాలకులుగా ఉంటాము. (అన్సారులైన) మీరు సలహాదారులుగా, మంత్రులుగా ఉంటారు." ఈ మాట వినగానే హుబ్బాబ్ బిన్ ముంజిర్ మధ్యలో జోక్యం చేసుకుని, 'దైవసాక్షి! మేమలా జరగనివ్వము. ఒక నాయకుడు మీలోనివాడై ఉంటే, ఒక నాయకుడు మాలోని వాడై ఉంటాడు' అని కరాకండీగా చెప్పారు. దానికి అబూబక్ర్(రజి), 'లేదు. పరిపాలకులుగా మేముంటాము, మంత్రులుగా మీరుంటారు. (ఎందుకంటే) ఖురైషులు యావత్ అరేబియాలో మర్యాదస్తులుగా పరిగణించబడతారు. వారి రాజ్యం (అంటే మక్కానగరం) అరేబియా నడిబొడ్డున ఉంది. ఉమర్‌కు విధేయతా ప్రమాణం (బైఅత్) చేస్తారో లేదా అబూ ఉబైదా బిన్ జర్రాహ్‌కు ప్రమాణబద్ధులై ఉంటారో మీ ఇష్టం' అని స్పష్టం చేశారు. అప్పుడు ఉమర్ కల్పించుకుని, 'లేదు, మేమంతా మీ సమక్షంలో విధేయతా ప్రమాణం చేస్తాము. మీరు మా నాయకులు. మాలో అందరికన్నా ఉత్తములు మీరు. దైవప్రవక్త(స) దృష్టిలో కూడా మీరే మా అందరికన్నా ప్రియతములు' అని చెప్పారు. ఇలా అంటూ ఆయన హజ్రత్ అబూబక్ర్(రజి) చేయి పట్టుకుని, చేతిలో చెయ్యేసి విధేయతా ప్రమాణం (బైఅత్) చేశారు. ఆ తరువాత అందరూ 'బైఅత్' చేశారు. అంతలో ఎవరి కంఠమో వినిపించింది– 'మీరంతా కలసి సాద్ బిన్ ఉబాదా(రజి)ను చంపేశార'ని. ఉమర్(రజి) దానికి సమాధానమిస్తూ, 'అల్లాహ్ అభిమతం ఇదే' అన్నారు.

హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : మరణానికి ముందు దైవప్రవక్త(స) దృష్టి ఆకాశం వైపునకు మళ్ళింది. ఆ సమయంలో ఆయన(స) ఇలా పలికారు: "ఓ అల్లాహ్! నన్ను అత్యున్నతమైన సహచరుల్లో చేర్చుకో". ఆయన(స) ఇలా మూడుసార్లు పలికారు. హజ్రత్ ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు : 'అబూబక్ర్, ఉమర్– వీరిద్దరి ప్రసంగాల ద్వారా లాభం చేకూరింది. ఉమర్(రజి) జనులను హెచ్చరించే ధోరణిలో మాట్లాడారు. ఎందుకంటే వారిలో కొందరు కపటులు కూడా ఉన్నారు. అందుచేత అల్లాహ్ ఈ విధంగా చేయించి (వదంతులు వ్యాపించకుండా) నిరోధించాడు. పిదప అబూబక్ర్(రజి) సత్యమైన వాక్కును, సన్మార్గాన్ని విశదపరిచారు. కర్తవ్య బోధ చేశారు. అంటే ఇస్లాంపై స్థిరంగా ఉండమని బోధపరిచారు. 'వమా ముహమ్మదున్ ఇల్లా రసూల్...' అనే ఆయత్‌ను పఠిస్తూ ఆయన బయటకు వచ్చారు.[1]

314-1. మహనీయ అబూబక్ర్(రజి) చేసిన ఈ అద్భుత ప్రసంగం ఇస్లామీయ వ్యవస్థను చెల్లాచెదరవకుండా కాపాడ గలిగింది. తమ వర్గానికి చెందిన వ్యక్తిని నాయకునిగా ఎంపిక చేయాలన్న అన్సార్ల ప్రతిపాదన సరైనది కాదు. ఒకే ఒరలో రెండు ఖడ్గాలు ఇమడలేవు. ఇద్దరు అమీర్లను నియుక్తుల్ని చేయాలన్న సాద్ బిన్ ఉబాదా (రజి) ప్రతిపాదనను గనక అమలుపరచి ఉంటే పరిణామం తీవ్రంగా ఉండేది.

ఈ హదీసు ద్వారా ఖిలాఫత్(ప్రాతినిధ్య) వ్యవస్థకు గల ప్రాముఖ్యత ఎటువంటిదో విదితమయ్యింది. ప్రవక్త ప్రియ సహచరులు దైవప్రవక్త(స) అంత్య క్రియల కంటే ముందే ఖలీఫాను ఎన్నుకుని ఒక అపురూపమైన ఆదర్శాన్ని నెలకొల్పారు. దురదృష్టవశాత్తు అలాంటి ప్రాతినిధ్య వ్యవస్థ స్థానంలో రాజరిక (ములూకియత్) వ్యవస్థ వచ్చింది. ముస్లింలు అరేబియా ఎల్లలు దాటి బయటి ప్రపంచంలో అడుగు పెట్టినప్పుడు అక్కడి సంస్కృతీ నాగరికతలకు, సావాసానికి ప్రభావితులై తమ విధ్యుక్త ధర్మాన్ని విస్మరించారు. పూర్వం తమ మార్గదర్శక ఖలీఫాలు అనుసరించిన విధానానికి తిలోదకాలిచ్చారు. అదే వారి పతనానికి కారణమయింది.



3

# గాఢాంధకారం

## (ఇస్లామ్ ప్రవక్త ప్రభవించే నాటికి ప్రపంచ ఆధ్యాత్మిక, నైతిక పరిస్థితి)

**- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

### యూదులు

**ప్రపంచంలో** మానవజాతి సంస్కరణా కార్యానికి వేరితరులకన్నా ఎక్కువగా ఆశించదగినవారు యూదుల. 'సామ్' సంతతిలో అందరికన్నా ముందు దైవసందేశ పరిచయ అమానతు వీరికే అప్పగించబడింది. అందుకే ఖుర్ఆన్ యూదుల నుద్దేశించి, **"అందరికన్నా ముందు మీరే దైవ సందేశాన్ని తిరస్కరించినవారు అవకండి"** (అల్ బఖర:41) అని ఉపదేశించింది. కాని ఈ జాతివారు కఠినాత్ములుగా నిరూపించుకున్నారు. వారు రాళ్ళల్లో నుంచి నీటి ఊటలు చిమ్ముకురావటం కళ్ళారా చూశారు. ఆ తియ్యని నీరును వారు స్వయంగా త్రాగారు కూడా. అయినా వారి రాతి గుండెలు కరగలేదు. ఖుర్ఆన్ తన కాలంలో వారి ఈ ధోరణిని ఎండగడుతూ ఇలా ఎత్తిపొడిచింది:

> **"వారి హృదయాలు రాళ్ళ మాదిరిగా అయిపోయాయి. కాదు, అంతకంటే కూడా కఠినమైపోయాయి."** *(అల్ బఖరహ్:74)*

వారు వివిధ కాలాలలో తమ ప్రవక్తలను ధిక్కరించారు. వారిని అబద్ధీకరించారు. వారిని వేధించారు. అంతేకాదు, వారిని చంపేశారు. మూసా, హారూన్ (అలైహిముస్సలాం)ల తరువాత వారిలో ప్రభవించిన దైవప్రవక్తలలో, వారి కాఠిన్యంపై తలబిరుసుతనంపై రోదించని ప్రవక్త లేడు. ఆ విషయాన్నే దివ్య ఖుర్ఆన్ ఇలా ప్రస్తావించింది :

> ఇస్రాయీలు సంతతివారిలో అవిశ్వాస మార్గం అవలంబించిన వారిని దావూద్ నోట, మర్యమ్ కుమారుడైన మసీహ్ నోట శపించటం జరిగింది. ఎందుకంటే వారు అవిధేయులయ్యారు. అత్యాచారాలు చేయసాగారు. చెడు పనులు చెయ్యకుండా వారు ఒకరినొకరు నిరోధించటం మానివేశారు. వారు అవలంబించిన మార్గం చాలా చెడ్డది.
>
> *(అల్ మాయిద:78, 79)*

దైవప్రవక్త మహనీయ దావూదు (అలైహిస్సలాం) జబూరులో పలుమార్లు ఇస్రాయీల సంతతి తలబిరుసుతనాన్ని గురించి బాధాతప్త హృదయంతో తన ప్రభువుకు ఫిర్యాదు చేసుకున్నారు–

"నా జనులారా! నా బోధకు చెవి యొగ్గుడి. నా నోటి మాటలకు చెవి యొగ్గుడి. నేను నోరు తెరచి ఉపమానము చెప్పెదను. పూర్వకాలపు గూఢ వాక్యములను నేను తెలియజెప్పెదను. మాకు తెలిసిన సంగతులను చెప్పెదను. యెహోవా స్తోత్రార్హ క్రియలను, ఆయన బలమును, ఆయన చేసిన ఆశ్చర్య కార్యములను దాచకుండా వాటిని వారి పిల్లలకు మేము చెప్పెదము. రాగల తరములలో పుట్టబోవు పిల్లలు దాని నెరుగునట్లును, వారు లేచి తమ పిల్లలకు దానిని వివరించునట్లును, వీరును దేవుని యందు నిరీక్షణ గలవారై దేవుని క్రియలను మరువక యుండి, యధార్థ హృదయులు కాక దేవుని విషయమై స్థిర మనసు లేనివారై తమ పితరుల వలె తిరుగబడకయు మూర్ఖతయు

తిరుగుబాటును గల ఆ తరమును పోలి ఉండకయు వారు ఆయన ఆజ్ఞలను గైకొనునట్లును, ఆయన యాకోబు సంతతికి శాసనములను నియమించెను. ఇశ్రాయేలు సంతతికి ధర్మ శాస్త్రము ననుగ్రహించెను. మన పితరులు తమ పుత్రులకు దానిని తెలుపవలెనని వారికాజ్ఞాపించెను. ... వారు దేవుని నిబంధనలను గైకొనకపోయిరి. ఆయన ధర్మశాస్త్రమును ననుస రింప నొల్లకపోయిరి. ఆయన క్రియలను, ఆయన వారికి చూపిన ఆశ్చర్య క్రియలను వారు మరచిపోయిరి. *(కీర్తనలు–78: 1–11)*

జబూరులోనే మరోచోట ఇలా ఉంది : "నా ప్రజలారా! ఆలకిం పుడి. నేను మీకు సంగతి తెలియజేతును. అయ్యో, ఇశ్రాయేలూ, నీవు నా మాట వినిన యెడల ఎంత మేలు. అన్యుల దేవతలలో ఒకటియును నీలో ఉండకూడదు. అన్యుల దేవతలలో ఒక దానికిని నీవు పూజ చేయకూడదు. ఐగుప్తీయుల దేశములో నుండి నిన్ను రప్పించిన నీ దేవుడనగు యెహోవాను నేనే. నీ నోరు బాగుగా తెరువుము. నేను దాని నింపెదను. అయినను నా ప్రజలు నా మాట ఆలకించకపోయిరి. ఇశ్రాయేలీయులు నా మాట వినకపోయిరి. కాబట్టి వారు తమ స్వకీయాలోచనలను బట్టి నడుచుకొనునట్లు వారి హృదయ కాఠిన్యమునకు నేను వారి నప్పగించితిని." *(కీర్తనలు – 81 : 8 – 12)*

"నీవు దుష్టత్వమును చూచి ఆనందించు దేవుడవు కావు. చెడు తనమునకు నీ యొద్ద చోటు లేదు. డాంబికులు నీ సన్నిధిని నిలువలేరు. పాపము చేయు వారందరు నీకసహ్యులు. అబద్ధమాడు వారిని నీవు నశింపజేయుదువు. కపటము జూపి నరహత్య జరిగించువారు యెహోవాకు అసహ్యులు. నేనైతే నీ కృపాతిశయమును బట్టి నీ మందిరములో ప్రవేశించెదను. నీ యెడల భయభక్తులు కలిగి, నీ పరిశుద్ధాలయము దిక్కు చూచి నమస్కరించెదను. యెహోవా, నా కొరకు పొంచియున్న వారినిబట్టి నీ నీత్యానుసారముగా నన్ను నడిపింపుము. నీ మార్గమును నాకు స్పష్టముగా కనబరచుము. వారి నోట యథార్థత లేదు. వారి అంతరంగము నాశనకరమైన గుంట. వారి కంఠము తెరచిన సమాధి. వారు నాలుకతో ఇచ్చకము లాడుదురు. దేవా, వారు నీ మీద తిరగబడి యున్నారు. వారిని అపరాధులుగా తీర్చుము. వారు తమ ఆలోచనలలో చిక్కుబడి కూలుదురుగాక! వారు చేసిన అనేక దోషములను బట్టి వారిని వెలివేయుము." *(కీర్తనలు – 5 : 4 – 11)*

మహనీయ ఈసా (ఏసుక్రీస్తు–అలైహిస్సలాం) కూడా ఇంజీలులో ఇస్రాయీల్ సంతతివారిని శపిస్తూ ఇలా అన్నారు :

"అయ్యో, వేషధారులైన శాస్త్రులారా! పరిసయ్యులారా! మీరు సున్నము కొట్టిన సమాధులను పోలియున్నారు. అవి వెలుపల శృంగారముగా అగుపడునుగాని లోపల చచ్చిన వారి యెముకల తోను, సమస్త కల్మషముతోను నిండియున్నవి. అలాగే మీరు వెలుపల మనుష్యులకు నీతిమంతులుగా నగుపడుచున్నారుగాని, లోపల వేషధారులతోను అక్రమముతోనూ నిండియున్నారు.

అయ్యో, వేషధారులైన శాస్త్రులారా! పరిసయ్యులారా! మీరు ప్రవక్తల సమాధులను కట్టించుచు, నీతిమంతుల గోరీలను శృంగారించుచు– మనము మన పితరుల దినములలో ఉండిన యెడల ప్రవక్తల మరణ విషయములో వారితో పోలినవారమై యుండక పోదుమని చెప్పుకుందురు. అందువలననే మీరు ప్రవక్త లను చంపినవారి కుమారులై యున్నారని మీ మీద మీరే సాక్ష్యము చెప్పుకొనుచున్నారు. మీరును మీ పితరుల పరిమాణము పూర్తి చేయుడి. సర్పములారా! సర్ప సంతానమా! నరక శిక్షను మీరేలాగు తప్పించుకొందురు?"

*(మత్తయి–23: 27–33)*

సరిగ్గా ఇదే ఆరోపణ వారిపై ఖుర్‌ఆన్ కూడా చేసింది :

> వారు అన్యాయంగా దైవప్రవక్తలను హత్య చేసేవారు. దీనికి ప్రధాన కారణం; వారు అవిధేయ జనులు. అల్లాహ్ నిర్ధారించిన హక్కులను అతిక్రమించేవారు. *(అల్ బఖరహ్: 61)*

వారిని అడుగు : "మీరు నిజంగా నమ్మేవారైతే, లోగడ వచ్చిన ప్రవక్తలను ఎందుకు హతమార్చేవారు?" *(అల్ బఖరహ్: 91)*

ఆలి ఇమ్రాన్ సూరాలో ఇంతకన్నా ముందుకు పోయి ప్రతి సత్య సందేశ ప్రదాతను హతమార్చే ప్రయత్నం చేసేవారని ఆరోపించటం జరిగింది :

> నిశ్చయంగా అల్లాహ్ ఆదేశాల పట్ల తిరస్కార వైఖరికి పాల్పడే వారు, అన్యాయంగా ప్రవక్తలను చంపేవారు, 'న్యాయం చేయండి' అని ఆజ్ఞాపించేవారిని (సయితం) హతమార్చేవారు – అలాంటి వారికి వ్యథాభరితమయిన శిక్ష పడుతుందన్న 'శుభవార్త'ను వినిపించు. *(ఆలి ఇమ్రాన్ : 21)*

అల్ బఖరహ్, ఆలి ఇమ్రాన్ అధ్యాయాలలో యూదుల ఒక్కో లోపాన్ని విప్పి చెప్పటం జరిగింది. దీనిని బట్టి వారు తమ ధర్మావలంబనలో ఎంతగా బరితెగించి పోయారో అర్థమవు తుంది. వారి హృదయ కాఠిన్యానికి, దురభిమానానికి అత్యంత నిర్దాక్షిణ్యమయిన ఒక ఉదంతం ఇస్లాంకు అరవై యేళ్ల క్రితం యమన్‌లో ఎదురయింది. యూదులు కందకాలలో అగ్ని రాజేసి నజరాన్ క్రైస్తవులను వాటిలో పడవేశారు. ప్రజలు అగ్నిలో దహించుకుపోతుంటే, అమానుషమైన ఆ దృశ్యాన్ని వారు

కందకాల ప్రక్కనే కూర్చుని, వికటాట్టహాసం చేస్తూ తిలకించారు. హృదయ విదారకమైన ఆ దృశ్యాన్ని ఖుర్‌ఆన్ ఇలా ప్రస్తావించింది :

**కందకం వాళ్ళు సర్వనాశనమయ్యారు. అది ఇంధనంతో తీవ్రంగా మండే అగ్నిగల కందకం. అప్పుడు వారు ఆ కందకం చుట్టూ కూర్చుండి విశ్వాసుల పట్ల తాము చేసిన నిర్వాకాన్ని చూస్తూ ఉండేవారు. ఆ విశ్వాసుల పట్ల వారి శత్రుత్వానికి కారణం ఇది తప్ప మరేమీ కాదు – మహాశక్తిమంతుడు, సకల స్తోత్రాలకు తగినవాడు, భూమ్యాకాశాల సామ్రాజ్యానికి యజమాని అయిన అల్లాహ్‌ను వారు విశ్వసించారు.** *(అల్ బురూజ్ : 4-9)*

పాక్షిక విషయాలను అలా పక్కనపెడితే, మొత్తమ్మీద వారిలో ఈ లోపాలుండేవి :

1. వారికి జాత్యహంకారం ఉండేది. తాము దేవునికి ప్రియతములము అన్న గర్వం కారణంగా తామేం చేసినా ప్రళయదినాన తమకు నిలదీత ఉండదని వారు తలపోసేవారు–

**"మేము అల్లాహ్ కుమారులము, ఆయనకు ప్రీతి పాత్రులము ... "** *(అల్ మాయిదా : 18)*

**"మమ్మల్ని లెక్కించదగిన కొన్ని రోజులు తప్ప నరకాగ్ని తాకదు" అని వారంటున్నారు.** *(అల్ బఖరహ్ : 80)*

స్వర్గంలోని భోగభాగ్యాలు కేవలం తమకే ప్రత్యేకమని వారు భావించేవారు. దానిపై ఖుర్‌ఆన్ ఇలా అంటోంది :

**వారికి చెప్పు: "ఒకవేళ అల్లాహ్ దృష్టిలో ఇతరులెవరికీ కాకుండా కేవలం మీ కొరకే పరలోక నెలవు ప్రత్యేకమై ఉంటే, మీరు మరణాన్ని కోరుకోండి. మీరు సత్యవంతులే అయితే ఈ పని చేసి చూపాలి."** *(అల్ బఖరహ్ : 94)*

దైవదౌత్యం, ప్రవక్తా పదవి కేవలం తమకే స్వంతమని, ఇతరులకు అందులో ఎలాంటి హక్కులేదని కూడా వారు తలపోసేవారు. దానికి సమాధానంగా ఖుర్‌ఆన్ ఇలా అంటోంది –

**ఇది అల్లాహ్ అనుగ్రహం. ఆయన దానిని తాను కోరిన వారికి ప్రసాదిస్తాడు.** *(అల్ జుముఅహ్ : 4)*

వారిలోని విద్యావంతులు, పండితులు తమ స్వార్థపూరిత ఉద్దేశాల కోసం, ధనికుల సంతోషాన్ని చూరగొనటం కోసం దైవాజ్ఞలలో మార్పులు చేర్పులకు ఒడిగట్టేవారు. దైవాదేశాలకు వక్రభాష్యం చెప్పేవారు. తమ స్వంత పర్యాలోచనలకు, వ్యాఖ్యానాలకు దైవగ్రంథంలోని ఆదేశాల స్థాయి కల్పించేవారు–

**"వారు గ్రంథ వాక్యాలను వాటి సరైన సందర్భం నుండి తొలగిస్తూ ఉంటారు."** *(అల్ మాయిదా : 41)*

**వారు తమ స్వహస్తాలతో గ్రంథాన్ని వ్రాసుకుని, 'ఇది దేవుని తరఫున వచ్చినది' అని బొంకుతారు–తద్వారా కొద్దిపాటి మూల్యాన్నయినా పొందవచ్చని వారలా చేస్తారు. వారికి వినాశం తథ్యం. వారి చేతులు లిఖించినది కూడా వారి వినాశానికి కారణమే. తద్వారా వారు ఆర్జించేది కూడా వారి వినాశానికి కారణభూతమే.** *(అల్ బఖరహ్ : 79)*

ఇక వారిలోని నిరక్షరాస్యులు, పామరుల విషయానికి వస్తే, వారు ఆ నోటా ఈ నోటా విన్న పుక్కిటి పురాణాలను నమ్మి నడుచుకునేవారు –

**వారిలో కొందరు నిరక్షరాస్యులు కూడా ఉన్నారు. వారికి గ్రంథజ్ఞానం లేదు. (వారివద్ద) వట్టి ఆశలున్నాయి. వారు కేవలం ఊహల్లో విహరిస్తున్నారు.** *(అల్ బఖరహ్ : 78)*

వారు తమ అవసరాలను తీర్చే దైవాదేశాలున్నప్పుడు వాటి ప్రకారం అమలుపరుస్తారు. వేరితర ఆదేశాలను వీపు వెనుక పడవేస్తారు –

**గ్రంథం వొసగబడిన ప్రజలలోని ఒక వర్గం, దైవగ్రంథాన్ని తమకేమీ తెలియదన్నట్లే వీపు వెనుక పడవేసేది.**

*(అల్ బఖరహ్ : 101)*


**మరైతే ఏ ప్రవక్త అయినా మీకు నచ్చని ఆజ్ఞను మీ వద్దకు తీసుకుని వచ్చినప్పుడు, మీరు గర్విష్టులుగా ప్రవర్తిస్తారా? మీరు వారిలో కొందరిని తిరస్కరించి, మరి కొందరిని హత్య చేశారు (అవునా?)** *(అల్ బఖరహ్ : 87)*

**(మౌలానా సయ్యిద్ సులైమాన్ నద్వీ–రహ్మ– విరచితమైన 'సీరతున్నబీ' పుస్తకం 4వ సంపుటం ఆధారంగా)** **(మిగతా వచ్చే సంచికలో)**

(మిగతా వచ్చే సంచికలో)

వ్యక్తి సంస్కార,
సంఘ నిర్మాణ,
నైతిక పథకం

గీటురాయి
వారపత్రిక




- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ

**ఈ వ్యాసంలో ఇస్లామ్ ధర్మాన్ని సంపూర్ణ జీవన సంవిధానంగా సంక్షిప్తంగా వివరించడం జరిగింది.**

1. ఇస్లాం ఏకేశ్వరోపాసన (తౌహీద్)కు సంబంధించిన ధర్మం. అది ప్రజలందరికీ (వారిని సృష్టించిన) ప్రభువు తరపు నుండి అందజేయబడిన సార్వజనీన సందేశం, అది మానవాళికి వారి ప్రభువు తరఫు నుండి చిట్టచివరి గ్రంథాన్ని (ఖురాన్‌ను) అందజేస్తుంది. మనసా వాచా కర్మణ- త్రికరణ శుద్ధితో దాన్ని స్వీకరిస్తే, అది మనిషి జీవితంలో విప్లవాత్మక మార్పు తీసుకు వస్తుంది.

## 2. నిజ దైవభావన

విశ్వాన్ని, విశ్వంలోని చరాచరాలన్నింటిని సృష్టించిన ఒక నిజ దేవుడిని ప్రజలు నమ్ముతారు. వారు ఆయనను మాత్రమే ఆరాధిస్తారు, ఆయనకు ఎవరినీ సహవర్తులుగా చేసి కొలవరు. ఆ నిజ ఆరాధ్యుని పేరే అల్లాహ్. ఆయన తప్ప నిజ ఆరాధ్యుడు ఎవడూ లేడు. ఆయన తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారు. ఆయనకి భాగస్వాములు లేదా భార్యాపిల్లలు లేరు. ఆయన మాత్రమే మొత్తం విశ్వాన్ని నియంత్రించేవాడు, మరియు ఆయన మాత్రమే అందరికీ జీవితాన్ని ప్రసాదించేవాడు. ప్రజలందరూ వారి మరణానంతరం ఆయన వద్దకే తిరిగి వస్తారు.

## 3. ఇస్లాం భావార్థం

(1) ఇస్లాం అంటే సమస్త జీవరాసులను సృష్టించిన ఒకే నిజ దేవునికి (సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు) సమర్పణ విధేయత. (2) ఇస్లాం అంటే మనం శాంతిని పొందడం, ఇతరులకు శాంతిని అందించడం. ఈ అర్థాల ప్రకారం, ఇస్లాం అనేది సమస్త మానవాళి కోసం అల్లాహ్ సమ్మతించి ఆమోదించిన జీవన సంవిధానం, తొలి మానవుడు, ప్రవక్త అయిన హజ్రత్ ఆదమ్(అ) మొదలు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) వరకు లోక కల్యాణార్థం వచ్చిన ప్రవక్తలందరి సందేశ సారం.

## 4. ఇస్లాం చివరి ప్రవక్త

ఇస్లాం ధర్మాన్ని సమస్త మానవుల జీవన సంవిధానంగా పరిచయం చేస్తూ వచ్చిన ప్రవక్తల సంఖ్య అక్షరాల 1 లక్ష 24వేలు. ఈ పరంపరలో చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స). పేరు

ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ (571-632 క్రీ.శ). ఆయన శుభ జననం అరేబియా ద్వీపకల్పంలోని మక్కాలో జరిగింది. అక్కడే ఆయన పుట్టి పెరిగారు. ఆయన (ఖురైష్) అనే గొప్ప అరబ్ తెగకు చెందినవారు. ఆయన ఉన్నత నైతిక ప్రమాణాలతో ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారు. ఆయన నడవడికను చూసిన జాతి వారు ఆయన్ను సాదిక్ - సత్యవంతుడు, అమీన్ - నమ్మదగినవాడు అని ప్రేమతో పిలిచేవారు.

ఆ సమాజంలో బహుదైవారాధన సర్వసాధారణమైనప్పటికీ ఆయన ఎప్పుడూ విగ్రహాలను పూజించలేదు. ఆయన తను ఒక ప్రవక్త అవ్వాలని ముందస్తు ప్రణాళిక వేయలేదు, ఇష్టాను సారంగా ప్రవక్త అయిపోలేదు. వాస్తవంగా అల్లాహ్ అయన ద్వారా అంతిమ సందేశం అయిన దివ్యగ్రంథం ''ఖురాన్''ను ప్రజలందరికీ తెలియజేయడానికి ఆయన్ను ఎంపిక చేసుకున్నాడు. ఖుర్ఆన్ అవతరణ 23 సంవత్సరాల వ్యవధిలో (610-632) ప్రవక్త ముహమ్మద్ (స) వారిపై దైవదూతల నాయకులైన జిబ్రీల్ ద్వారా అరబిలో అవతరింపజేయబడింది. ఆయనను ముస్లింలు విశ్వ జనులందరి కోసం విశ్వ ప్రభువు అల్లాహ్ పంపిన ప్రవక్తగా నమ్ముతారు.

## 5. మూలం, వ్యాప్తి

ఇస్లాం అంతిమ సందేశం మక్కాలో సంపూర్ణమయింది. అయితే మొదటి ఇస్లామీయ సువ్యవస్థ మదీనాలో (మక్కాకు ఉత్తరాన 400 కి.మీ దూరాన) స్థాపించబడింది. క్రీ.శ.623లో మహమ్మద్ ప్రవక్త మరియు ఆయన సహచరులు కొందరు అక్కడికి వలస వెళ్లారు.

ప్రవక్త ముహమ్మద్(స) మరణం తరువాత, ఆయన సహచరులు, వారి అనుచరులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ ఇస్లాం సందేశాన్ని తెలియజేయడానికి పూనుకున్నారు.

క్రీ.శ.636లో, ఇస్లాం పాలస్తీనా, సిరియా, ఈజిప్ట్, ఉత్తర ఆఫ్రికా లోని చాలా ప్రాంతాలతోపాటు భారత దేశానికి కూడా చేరుకుంది.

మాలిక్ బిన్ దీనార్, 20 మంది ముహమ్మద్ ప్రవక్త అనుయా యులు, మొదట కేరళలోని, కొడుంగళూర్ వచ్చారు. వీరు భారతదేశంలో ప్రవేశించినపుడు, ఈ రాష్ట్రాలలో ఇస్లాం ధర్మానికి మంచి స్పందన లభించింది. తదనంతరం, ఇతర రాష్ట్రాలలో కూడా మంచి స్పందన లభించింది. ఇస్లామీయ తత్వం, ఏకేశ్వరోపాసక నియమం, సర్వమానవ సోదర భావన, సమానత్వాల ప్రవచనాలు, శాస్త్రాలతో కూడిన ఖురాన్ సాదా సీదా జీవన సరళి మున్నగు విషయాలు ప్రజలపై ప్రభావం చూపాయి. మాలిక్ బిన్ దీనార్ మొదటి మస్జిద్‌ను నిర్మించాడు, ఈ మస్జిద్ భారతదేశంలోనే కాక భారత ద్వీపకల్పంలోనే ఇది ప్రథమ మస్జిద్ కూడానూ. ఇది క్రీ.శ. 629లో నిర్మింపబడినదని భావిస్తున్నారు. మరి ఒక ముఖ్యమైన ప్రాముఖ్యతను ఈ మస్జిద్ సంతరించుకొంది. అది యేమనగా, సౌదీ అరేబియా లోని మదీనా తరువాత ఈ మస్జిద్ 'శుక్రవారపు ప్రార్థనలు' జరుపుకున్న ప్రపంచంలోనే రెండవ మస్జిద్.

క్రీ.శ.642లో ఇస్లాం పర్షియాకు చేరుకుంది. అదనంగా, ఇస్లాం ఏడవ శతాబ్దిలో చైనాకు చేరుకుంది.

## 6) ప్రవక్త ముహమ్మద్ (స) వారి అనుయాయులు

తాజా గణాంకాల ప్రకారం ప్రపంచంలోని ముస్లింల సంఖ్య దాదాపు 1.8 బిలియన్లు. ఇస్లాం భూమిపై రెండవ అతిపెద్ద మతం. వారు 50 దేశాలలో అత్యధిక జనాభాను కలిగి ఉన్నారు. ముస్లింలలో 20% మాత్రమే అరబ్బులు.

## 7) ఇస్లాం ధర్మ గ్రంథం ఖుర్ఆన్

''ఖుర్ఆన్'' ఇస్లాం ధర్మ గ్రంథం. దీనిని ''పవిత్ర ఖుర్ఆన్'' ''పరిశుద్ధ ఖుర్ఆన్'' అని పిలుస్తారు. దీనిని ముస్లింలు అల్లాహ్ అంతిమ గ్రంథంగా పరిగణిస్తారు. అది అల్లాహ్ మానవాళి కోసం పంపిన అన్ని మునుపటి గ్రంథాలను (వ్యాఖ్యానాలు, మార్పులు లేకుండా వాటి అసలు రూపాల్లో) ధ్రువపరుస్తుంది. ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)కు ఇవ్వబడిన సుహూఫ్ (ప్రతులు), ప్రవక్త దావూద్(అ)కు ఇవ్వబడిన జబూర్ (కీర్తనలు), ప్రవక్త మూసా (అ)కు ఇవ్వబడిన తౌరాత్ (తోరా) మరియు ప్రవక్త ఈసా(అ)కు ఇవ్వబడిన ఇంజీల్ (దేవుని సువార్త) వంటి దైవ గ్రంథాలను ధ్రువీకరిస్తుంది, వాటి సారాంశాన్ని సంరక్షిస్తుంది.

ఖుర్ఆన్ భూమిపై ఉన్న సురక్షిత దైవగ్రంథం. అది మానవులచే మార్పులు చేర్పులు చేయబడకుండా అల్లాహ్ వాక్యాలను కలిగి ఉన్న ఏకైక గ్రంథం. అది సకల వక్రీకరణలు, వక్ర భావాల నుండి భద్రపరచబడిన అద్వితీయ అద్భుత దైవగ్రంథం.

అది దేవుని చట్టం, అల్లాహ్ ఆజ్ఞలతో పాటు ప్రజలందరి కోసం సార్వజనీన సందేశం. జాతులు మరియు భాషలతో సంబంధం లేకుండా ప్రపంచం నలుమూలల నివసించే కోట్లాది మంది ప్రజల హృదయాలను బలంగా ప్రభావితం చేసిన శక్తివంతమైన గ్రంథం. అలాగే ప్రాంతానికి, భాషకి, జాతికి అతీతంగా లక్షలాది మంది ప్రజలచే మొదటి నుండి చివరి వరకు కంఠస్తం చేయబడి భద్రపరచబడిన గ్రంథం.

## 8) ఇస్లాం ధర్మ నిర్మాణం

ఇస్లాంను రెండు భాగాలుగా విభజించవచ్చు: (1) ఇస్లామీయ విశ్వాసం (2) ఇస్లామీయ ధర్మ శాస్త్రం (చట్టం, జీవన విధానం). వాటిని సాధారణంగా అరబిలో అకీదః మరియు షరీఅహ్ అని పిలుస్తారు.

అకీదః అనేది ఇస్లాం "నమ్మకం". అది ఇస్లాంలోని అవిభాజ్యాంశం, కీలక భాగం. విశ్వాసం (ఈమాన్) ఆరు విధాలుగా ఉంటుంది. అవి - అల్లాహ్ పై దృఢమైన విశ్వాసం. ఆయన మనల్ని - ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను, మరణానంతర జీవితాన్ని, మంచీ చెడు విధివ్రాతలను విశ్వసించమని ఆజ్ఞాపించాడు.

ఇస్లామీయ ధర్మ శాస్త్రం అనేది "ఆచరణ" సంబంధితమైనది. అది ఇస్లామీయ సువ్యవస్థ, చట్టం మరియు జీవన విధానం. ఇది ఖుర్ఆన్, ప్రవక్త ముహమ్మద్(స) వారి (సున్నత్) బోధనలలో వివరించబడింది.

అది మూడు ప్రధాన శాఖలను నియంత్రించే నియమాలు, నిబంధనలు మరియు మార్గదర్శకాలను సూచిస్తుంది:

1- ఆచారాలు/ఆరాధనలు

2- నైతికత, నీతి (ముస్లిం ప్రవర్తనలో అంతర్భాగంగా ఉండాలి)

3- వ్యక్తుల మధ్య లావాదేవీలు (సామాజిక/ఆర్థిక విషయాలు)

## 9) ఇస్లాంలో ఆరాధన (ఇస్లాం 5 మూల స్తంభాలు)

ఇస్లామీయ ధర్మ శాస్త్రంలో పేర్కొన్న ఆచారాలు, ఆరాధనలు. (ఇస్లాం ధర్మ 5 మూల స్తంభాలు) ముస్లింగా మారడానికి, మీరు మొత్తం ఐదు స్తంభాలను తెలుసుకోవాలి.

(1) షహాదహ్ (విశ్వాస సంబంధిత రెండు సాక్ష్యాలు).

(2) అల్లాహ్ ప్రీతి కోసం రోజువారీ ఐదు పూటల ప్రార్థనలను స్థాపించడం.

(3) ప్రతి సంవత్సరం రమజాన్ మాసపు పూర్తి ఉపవాసాలు పాటించడం (ఉపవాసం).

(4) పేదవారికి వార్షిక జకాత్ చెల్లించడం.

(5) మక్కాలో ఉన్న కాబా గృహాన్ని సందర్శించి జీవిత కాలంలో ఒకసారి హజ్ చేయడం.

హజ్ ప్రయాణం సుమారు ఒక వారం నుండి మూడు వారాల పాటు సాగుతుంది. ప్రవక్త ఇబ్రహీం(అ)కు సంబంధించిన అనేక సంప్రదాయాలను నిర్వహించడం అవసరం. (మస్జిద్ హరామ్ లోపల, వెలుపల).

## 10) ఇస్లాంలో చేయవలసినవి, చేయకూడనివి

ముక్తసరిగా చెప్పాలంటే, మంచిని "చెయ్యండి", చెడు చేయడం మానుకోండి.

## ఇస్లాంలో ఘోర పాపాలు:

(1) విశ్వాన్ని, అన్ని జీవులను సృష్టించిన దేవుని ఉనికిని తిరస్కరించడం (అంటే నాస్తికత్వం). అదే విధంగా, నిజ ఆరాధ్యుడైన అల్లాహ్‌ను కాకుండా ఇతర సృష్టిరాసులపై నమ్మకం మరియు అలాహ్ ఆరాధనలో వారిని భాగస్తులుగా చేర్చడం (షిర్క్).

(2) తల్లిదండ్రులకు అవిధేయత, వారితో చెడుగా ప్రవర్తించడం.

(3) హత్య, ప్రజలను చంపడం ఆత్మహత్య చేసుకోవడం.

(4) వ్యభిచారం, స్వలింగ సంపర్కం, లైంగిక వేధింపులు

(5) అనాధ సంపదను అక్రమంగా వినియోగించడం లేదా స్వాధీనం చేసుకోవడం.

(6) కొలతల్లో తూనికల్లో మోసం చేయడం. ఇతరులతో ఆర్థిక, ఆర్థికేతర లావాదేవీలకు ఇది వర్తిస్తుంది.

(7) న్యాయస్థానంలో సాక్ష్యం చెప్పేటప్పుడు అసత్యం లేదా అబద్ధం చెప్పడం.

(8) అవసరమైన వ్యక్తులకు రుణమిచ్చేటప్పుడు వడ్డీ వసూలు చేయడం.

## 11) ఆహార పానీయాలు

కింది వాటిని మినహాయించి సముద్రపు ఆహారంతో సహా అన్ని ఆహారాలు (అంటే హలాల్) తినడానికి అనుమతి ఉంటుంది:

(1) పంది మాంసం

(2) మాంసం తినే ఏదైనా జంతువు.

(3) చనిపోయిన జంతువులు.

(4) ఇస్లామీయ పద్ధతి ప్రకారం వధించబడని ఏదైనా జంతువు.

రక్తం, ఆల్కహాలిక్ డ్రింక్స్ (ఉదా. వైన్) మినహా అన్ని పానీయాలు ధర్మసమ్మతమైనవి. మత్తుపానీయాలు తక్కువ తాగినా లేదా ఎక్కువ తాగినా మతి భ్రమించేలా చేస్తాయి.

## 12) డ్రస్ కోడ్

**మహిళలు :** యుక్తవయస్సు వచ్చినప్పుడు మాత్రమే శరీరం, తల వెంట్రుకలను కప్పి ఉంచే నిరాడంబరమైన వస్త్రధారణ

చేసుకోవాలి.

**పురుషులు** : ప్రధానంగా నాభి (బొడ్డు) నుండి మోకాళ్ల వరకు కప్పి ఉంచే నమ్రతతో కూడిన వస్త్రధారణ చేసుకోవాలి.

### 13) వారాంతం

ముఖ్యంగా ముస్లిం దేశాలలో శుక్రవారం ముస్లింలకు విశ్రాంతి దినం. వారు మస్జిదులో సామూహిక శుక్రవారం ప్రార్థనలు చేయవలసి ఉంటుంది మరియు ఒక చిన్న ప్రసంగాన్ని వినవలసి ఉంటుంది.

### 14) పండుగలు

చంద్రమానం ప్రకారం రెండు వార్షిక పండుగలు నిర్దేశించబడ్డాయి.

ఈదుల్ ఫిత్ర్ : రమజాన్ ఉపవాస నెల ముగింపులో.

ఈదుల్-అజ్హా : (3 రోజులు)

ఇస్లాంలో మూడు పవిత్ర స్థలాలు మాత్రమే ఉన్నాయి :

(1) మక్కాలోని మస్జిదె హరామ్, ఇందులో కాబా ఉంది.

నిజ ఆరాధ్యుడైన అల్లాహ్‌ను కీర్తించడానికి, ఆరాధించడానికి భూమిపై నిర్మించబడిన మొదటి ప్రార్థనా గృహం.

ప్రవక్త ఇబ్రాహీం(అ) దానిని పునర్నిర్మించారు. దాని అసలు పునాదిపై దాని గోడలను ఎత్తారు.

ప్రపంచం నలుమూలల నుండి ముస్లింలు మక్కాలోని మస్జిదె హరామ్‌లోని కాబా వైపు ముఖం చేసి ప్రార్థన చేస్తారు.

(2) మదీనాలోని ప్రవక్త ముహమ్మద్ (స) మస్జిద్ (మస్జిదె నబవి)

ఇస్లామీయ సువ్యవస్థ వైపునకు ప్రస్థానం తర్వాత నిర్మించబడిన మొదటి మస్జిద్.

మానవాళికి దేవుని సందేశాన్ని తెలియజేయడానికి ప్రారంభ స్థానం.

(3) ఫాలస్తీనా (జెరూసలేం)లోని అల్-అక్సా మసీదు, ఒకే ఒక్క నిజ ఆరాధ్యుడైన అల్లాహ్‌ను ఆరాధించడానికి భూమిపై నిర్మించబడిన రెండవ మసీదు. ఇది ఇస్లాంలో మొదటి "కిబ్లా" కూడా. ప్రార్థన సమయంలో దిశ కాబాకు మార్చడానికి ముందు ముస్లింలు ఈ దిశకు ముఖం చేసి ప్రార్థన చేసేవారు.

## విమర్శల గొంతునొక్కే అప్రజాస్వామిక వ్యూహాలు

సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ X లో అమెరికా నుంచి పనిచేసే మానవ హక్కుల సంస్థలు, ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్, హిందుస్ ఫర్ హ్యూమన్ రైట్స్ ఖాతాలను స్తంభించేలా చేయడానికి భారత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ చర్యలపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ప్లాట్ ఫారం ఎక్స్‌ను గతంలో ట్విట్టర్ అని పిలిచేవారు. భారత సమాచార సాంకేతిక చట్టం, 2000 ఉల్లంఘనలను పేర్కొంటూ భారత ప్రభుత్వం నుండి వచ్చిన "చట్టపరమైన తొలగింపు డిమాండ్"కి ప్రతిస్పందనగా ప్లాట్‌ఫారం ఎక్స్ ఈ చర్యలు తీసుకుంది. ప్రత్యేకంగా, చట్టంలోని సెక్షన్ 69ని అమలులోకి తెచ్చింది, ఇది కంటెంట్-ని నియంత్రించే అధికారం ప్రభుత్వానికి ఇస్తుంది. కంటెంట్ జాతీయ భద్రత, సార్వభౌమాధికారం లేదా పబ్లిక్ ఆర్డర్‌కు ముప్పుగా భావించినట్లయితే దాన్ని నిరోధించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. అమెరికా నుంచి పనిచేసే ఈ రెండు సంస్థలు, ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్, హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్ లాభాపేక్ష లేని సంస్థలు. భారతదేశంలోని మైనారిటీ హక్కులు, కుల అసమానతలకు సంబంధించిన సమస్యలపై పనిచేసే సంస్థలు. ఈ చర్యను ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రషీద్ అహ్మద్ విమర్శించారు. తమ సోషల్ మీడియా ఖాతా భారతీయ-అమెరికన్ ముస్లింలకు మానవ హక్కుల స్థితిగతులపై గొంతువిప్పే ఒక ముఖ్యమైన వేదిక అన్నారు. భారతదేశంలోను, అమెరికాలోను భావవ్యక్తీకరణను, ప్రజాస్వామ్యాన్ని అణిచివేసేందుకు ప్లాట్ ఫారం X ఎగ్జిక్యూటివ్ ఎలోన్ మస్క్ ప్రయత్నిస్తున్నారని, నరేంద్రమోడీకి సహకరిస్తున్నారని అహ్మద్ ఆరోపించారు. హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేసింది. భారతదేశంలోను, విదేశాల్లోను అసమ్మతి స్వరాలకు వ్యతిరేకంగా మోడీ పాలనలో కొనసాగుతున్న అణిచివేతలో ఇది కూడా ఒక భాగమని పేర్కొంది. హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీతా విశ్వనాథ్‌ను కలిసినందుకు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ దాడి చేసిన నేపథ్యంలో ఈ ఘటన చోటు చేసుకుంది. హంగేరియన్-అమెరికన్ పెట్టుబడిదారుడు జార్జ్ సోరోస్ నిధులు సమకూర్చిన వారిలో విశ్వనాథ్ కూడా ఉన్నారని ఇరానీ ఆరోపించారు. భారత ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని అధికార భారతీయ జనతా పార్టీ చాలాకాలంగా ఆరోపిస్తోంది. భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అప్రజాస్వామికమైనవన్న ఆరోపణలు ఇప్పుడు మరింత బలంగా వినిపిస్తున్నాయి.



# తెలుగు రాష్ట్రాల్లో గుంభనంగా ఉన్న ముస్లిం ఓటర్లు

**- షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల**

**తెలుగు రాష్ట్రాలలో** ముఖ్యంగా తెలంగాణాలో అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ కూడా విడుదలై ఎన్నికలకు పార్టీలు సన్నద్ధమై ప్రచారాలు మొదలు పెట్టాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా తెలంగాణాతో పాటు ముందస్తు ఎన్నికలు జరుగుతాయన్న పుకార్లు పెద్దగానే వినిపించాయి. నిజమే అన్నట్టు రెండు ప్రాంతీయ పార్టీలు వివిధ రూపాల్లోప్రచారం మొదలు పెట్టాయి. నంద్యాలలో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పర్యటన ప్రచారంలో పెద్ద ఎత్తున కదలిక తెచ్చింది. ఆయన అరెస్టు కావడంతో ఆపార్టీ ప్రచార షెడ్యూల్ కాస్త వెనకబడింది. అన్నీ నియోజకవర్గాలలో ఈవియంలు (EVM) చేరుకోవడం, వాటి పరిశీలన, ఉద్యోగుల బదిలీలపై ఆంక్షలు లాంటి అంశాలు ఎన్నికల కోలాహలం గుర్తు చేస్తున్నాయి. ఏమైనా మరో ఆరు నెలల్లో ఆంధ్రప్రదేశ్ లో కూడా ఎన్నికలు తప్పవు.

అయితే రాజకీయ పార్టీలు, కార్యకర్తల్లో తప్ప ప్రజల్లో ఎన్నికల చాటింగ్ అనుకున్నంత హుషారుగా రెండు తెలుగు రాష్ట్రాలలో లేదనే చెప్పాలి. టీ హెూటళ్లలో తదితర పబ్లిక్ స్థలాలలో రాజకీయ చర్చ అగుపించడంలేదు. టీవీ డిబేట్‌లలో కూడా ఇంకా రసవత్తర చర్చ మొదలు కాలేదని చెప్పాలి. మరీ ముఖ్యంగా రెండో అతి పెద్ద జనసమూహం అయిన ముస్లిం మైనారిటీలలో అనుకున్నంత జోష్ లేదనే చెప్పాలి. ఎవరు గెలిస్తె మాకేంటి అని కొందరైతే, ఎటు అప్పటికి వచ్చే తాయిలాలు సరేసరి. కాని మైనార్టీలలో మేధావి వర్గం, ముస్లిం ఓట్లను ప్రస్తుతానికి సంఘటిత పర్చకపోయిన కొన్ని పార్టీలకు ఓటేయకుండా నిలువరించే ప్రయత్నంలో సఫలీకృతం అయ్యారని చెప్పుకోవచ్చు.

తెలంగాణాలో ప్రస్తుతానికి భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ముస్లింలకు అనుకూలంగా ఉంది. బీజేపీకి వ్యతిరేకంగా నిలబడటం, సెక్రటేరియట్ మస్జిద్ పునర్నిర్మాణం, మతకలహాలు లేకపోవడం, పెద్దగా పన్నులు వేయక పోవడం బీఆర్ఎస్ పార్టీ అందరి మన్ననలు పొందుతూ మరీ ముఖ్యంగా లౌకికతత్వం ప్రదర్శిస్తుంది. కాకపోతే ముస్లింలకు ఇస్తానన్న 12 శాతం రిజర్వేషన్లు, కొన్ని చోట్ల మస్జిద్‌లు తెరవకపోవడం ఉదాహరణకు గోల్కొండలో లేని దేవాళయం ప్రారంభమైతే, అక్కడున్న మస్జిద్ తెరవలేక పోవడం. అడపాదడపా ఓవైసితో కలిసి బీజేపికి బీ టీమ్ అనే విమర్శలు ప్రభుత్వ గృహాల కేటాయింపులో ముస్లిం లకు తగిన ప్రాధాన్యత లేకపోవడం, పాత నగరాభివృద్ధికి తెలంగాణా ప్రభుత్వం తగిన లాంగ్ టర్మ్ ప్రణాళిక రచించ లేదన్నది వాస్తవం. ఆర్టీసి, పోలీస్ హెూమ్ గార్డ్స్ తదితర ఉద్యోగాల్లో ముస్లింల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు

తెలుస్తుంది. ఉర్దూ భాషా కేంద్రంగా విరజిల్లిన హైదరాబాద్‌కు పూర్వవైభవం తీసుకొని రావడంలో కూడా బీఆర్ఎస్ అనుకున్నంత కృషి చేయటం లేదని ఉర్దూ సాహితి ప్రియులు కినుక వహించా రన్నది కూడా వాస్తవం. కాంగ్రెస్ పార్టీని అభిమానించే ఓ వర్గం ముస్లింలు బీఆర్ఎస్‌కు మైనస్ పాయింట్స్ అని చెప్పుకోవచ్చు. అయితే ఈసారి మరో నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓ మహిళతో సహా ముస్లిమేతరులకు సీటిచ్చి మజ్లిస్ కొత్త ఒరవడి చూపిస్తోంది. తెలంగాణాలోని ఇతర జిల్లాలలో తమ అభిమానులు ఉన్న చోట మరో ఐదు చోట్ల అభ్యర్థులను నిలపాలని ఆలోచనలో యంఐయం ఉన్నట్లు తెలుస్తుంది. మతతత్వ బిజెపిని నిలువరించటానికి ముస్లింలు ఇతర ప్రజాస్వామ్య వాదులు ఈ సారి బీఆర్ఎస్, కాంగ్రెస్, యంఐయం పార్టీ వైపు మొగ్గు చూపవచ్చు. అయితే ఏ పార్టీ ముస్లింలకు ఎన్ని సీట్లు ఇచ్చింది అన్నది కూడా ముస్లిం ఓటర్లకు ప్రభావితం చేసే అంశమే!

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీలైన వైయస్సార్ పార్టీ, తెలుగుదేశం పార్టీలే ప్రస్తుతం ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థి పార్టీలు కూడా. ప్రస్తుతానికి ఇక్కడ బీజేపి అనుకున్నంత ప్రాచుర్యం కాని, క్యాడర్ కాని తయారు చేసుకోలేదు. పోటి చేసే ప్రాబల్యం కూడా సంతరించుకోలేదు. అందుకే బీజేపి తరపున పోటీ చేయాలన్న అభ్యర్థులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ముందుకు రాలేక ఇతర పార్టీలు చూసుకుంటున్నారు. ఇక కాంగ్రెస్ కు పాత ఓటు బ్యాంకు ఉన్న వారిని సంఘటిత పరిచే నాయకత్వం లేదని చెప్పాలి. ఇప్పట్లో అధికారం సాధ్యం కాదు కాబట్టి ఆ పార్టీ కోసం ఖర్చు పెట్టుకుని పార్టీని నడిపించే గట్టి రథసారధి లేరు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నిలబడి ప్రధాన ప్రాంతీయ పార్టీలను ఎదుర్కోవాలంటే గట్టి అభ్యర్థులు కావాలి. కర్నాటకలో ఎద్దేలు కర్నటక విధానంలో 'జాగో ఆంధ్ర' నినాదంతో ఇండియా కూటమి కోసం కొందరు మేధావులు కే.యం.సుభాన్ నాయకత్వంలో ఓ ప్రయత్నం కూడా మొదలు పెట్టారు. టీడీపీ, వైసిపి పై వెగటు కలిగిన ఓటరు సహజంగానే మరో ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారు. టిడిపి, వైసిపి బీజేపికీ అనుకూలంగా ఉంటాయన్నది నిర్వివాదాంశం. బీజేపి పాలిత రాష్ట్రాల కన్న ఆంధ్రప్రదేశ్ ఎంపీలు ముందుండి పార్లమెంటులో బీజేపికి మద్దతిస్తున్నారు. ఇక్కడ ముస్లింలకు బుజ్జగిస్తూనే కేంద్రంలో నల్ల పౌరసత్వ చట్టాలకు మద్దతు, ఆర్టికల్ 370 రద్దు, యూనిఫాం సివిల్ కోడ్ లాంటి అన్ని చట్టాలకు టిడిపి, వైపిసి మద్దతిస్తున్నాయి. ఈ సారి బీజేపి హిందూ రాష్ట్ర భూమిక పోషిస్తే ఈ రెండు పార్టీలు బీజేపికి సపోర్ట్ ఇవ్వవని గ్యారెంటీ లేదు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన మంత్రి వర్గంలో ఎన్నికల ముందు ఆర్నెల్ల వరకూ ఒక్క ముస్లింకు తీసుకోలేదు. ఇస్లామిక్ బ్యాంక్ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించి అమలు చేయలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి సైతం ఇస్లామిక్ బ్యాంక్, మధ్యం నివారణ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించి అమలు ఊసే లేదు. ఇలా రెండు ప్రాంతీయ పార్టీలు ముస్లింలను ఆకట్టుకోలేదన్నది వాస్తవం.

ప్రస్తుతం ముస్లింలు 'ఇండియా కూటమి' వైపు లేదా మరో ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారు. అందుకే ప్రస్తుతానికి ముస్లింలు గుంభనంగానే ఉన్నారు. భవిష్యత్తులో రాబోయే ప్రమాదాల దృష్ట్యా కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వం బలమైందిగా, లౌకికత్వం, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పాలించేదిగా ఉండాలని, దేశ ఐక్యత కాపాడే రాజకీయ పార్టీ కావాలని చూస్తున్నారు. ప్రాంతీయ పార్టీలు ఎంత భరోసా కలిగిస్తాయి లేదా మతతత్వ బీజేపికి వ్యతిరేకంగా ఉంటాయి అని ఆలోచిస్తున్నారు. వామపక్షాలు లేదా స్వతంత్ర్య అభ్యర్థులు, ఎస్డిపిఐ, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా లాంటి పార్టీల మ్యానిఫెస్టోలు, అభ్యర్థుల వైపు కూడా చూస్తున్నారు. ప్రస్తుతానికి తమకు అనుకూలమైన, తమ ఉనికిని కాపాడే పార్టీ, ఆయా పార్టీల్లో తమకు లభించేస్థానాలు బేరీజు వేస్తున్నారు. అయితే ముస్లింలు ఎప్పుడు ఓట్లు ఇవ్వడము కాదు, ఓట్లు తీసుకునే స్థాయికి ఎదగాలి. మంచి రాజకీయ శక్తిగా, మంచి నాయకత్వం సంతరించుకోవాలి. ఇప్పటికి రెండు తెలుగు రాష్ట్రాలలో యాభై స్థానాల జయాపజయాలు ముస్లింలు మాత్రమే నిర్ధారించగలరు. మరో యాభై స్థానాలు ముస్లిం ఓటర్లు కీలకంగా వ్యవహరించగలరు. కాని తమ బలం అంచనా వేయడంలో, తమ సంఘటిత శక్తి ప్రదర్శింటంలో ముస్లింలు చొరవ చూపటం లేదు. పార్టీల్లో నాయకులుగా ఉన్నవారు తమ అధికారం కోసమే పనిచేస్తున్నారు. ఏమైనా రాబోవు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో గుంభనంగా ఉన్న ముస్లిం ఓటర్లు ఏం చేస్తారో వేచి చూడాలి. ●

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



# ఆరోగ్యమే మహాభాగ్యం

- డాక్టర్ ఎన్.ఖలీల్

**జనారోగ్యమే జాతి మహాభాగ్యం.** ఆ ఆశయం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని దేశ ప్రజలందరికి వైద్య సేవలు అందుబాట్లోకి తెస్తామని పాలకులు గత ఏడున్నర దశాబ్దాలకు పైగా చెబుతున్నా, లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితాలు చేకూరడం లేదు. దేశానికి పట్టుకొమ్మలైన గ్రామసీమల్లో ఆరోగ్య వ్యవస్థ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పవచ్చు. ముఖ్యంగా వర్షాకాలం ఆరంభమైన తర్వాత కొత్త నీరు, పాత నీరు కలయికతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో లక్షలాది మంది రకరకాల వ్యాధుల బారిన పడుతున్నారు. ఇన్నేళ్ల తరువాత కూడా భారత్‌లో దాదాపు నలభై ఏడు కోట్ల మందికి పైగా అత్యవసర మందులు అందుబాట్లో లేవని అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. అన్నిటికంటే ముఖ్యంగా దేశంలో దిగువ మధ్యతరగతి ప్రజలు పెట్టే ఖర్చులు దాదాపు డెబ్బై శాతానికి పైగా మందుల కొనుగోళ్లకే ఖర్చవుతున్నాయి. మందుల్లో నాసికరం, నకిలీవి కూడా జనారోగ్యాన్ని పతనపు అంచుకు తీసుకుపోతున్నాయి. దేశవ్యాప్తంగా దాదాపు ఇరవైఐదు వేలకు పైగా మందులు నమోదై వుంటే అంతకు రెట్టింపు స్థాయిలో మందులు విచ్చలవిడిగా సరఫరా అవుతున్నాయి. భారత్‌లో నకిలీ, నాసికరం మందుల వ్యాపారం యేటా ఇరవైవేల కోట్ల రూపాయలకు పైగా ఉండొచ్చని అంచనా. దేశంలోని నకిలీ మందులు యేటా ఇరవై శాతం పైగా ఉంటుందని 'అసోచామ్' ఏనాడో వెల్లడించింది.

ప్రజారోగ్యాన్ని గుల్ల చేస్తున్న ఈ నకిలీ మందులు మార్కెట్లోకి ఒక వ్యూహం ప్రకారం ప్రవేశపెడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అంతగా తనిఖీలు లేకపోవడంతో ఇష్టానుసారంగా నకిలీ మందుల వ్యాపారం జరుగుతున్నది. మార్కెట్ ఐటమ్స్ అంటే బాహాటంగానే అమ్ముకుంటున్నారు. ముప్పై నుంచి యాభై శాతం వరకు కూడా డిస్కౌంట్లు ఇస్తూ పెద్ద పెద్ద బోర్డులు పెట్టి అమాయకులను దగా చేస్తున్న సంఘటనలు దేశవ్యాప్తంగా తరుచుగా జరుగుతున్నాయి. పాలకులు తీసుకుంటున్న చర్యలేవీ వీటిని నిరోధించలేకపోతున్నాయి. ఈ నకిలీ వ్యాపారం ఇప్పటికిప్పుడు మొదలుకాకపోయినా ఏనాటి నుంచో వున్నా రాను రాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. మందుల్లో ప్రామాణికత దెబ్బతినడం వల్ల జరుగు తున్న అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. గతంలో ఒకసారి ముంబైలోని ఒక హాస్పిటల్లో 'మానిటాల్' అనే మెదడు వ్యాపుకు వాడే మందులో కల్తీ జరగడంతో ఏకంగా పధ్నాలుగు మంది మరణించారు. అప్పుడు పెద్దఎత్తున నిరసనలు, ఆందోళనలు పెల్లుబికాయి. పరిస్థితిని గ్రహించిన ఆనాటి పాలకులు జస్టిస్ లెంటిన్ కమిషన్‌ను నియమించింది. మంత్రిత్వ స్థాయి నుండి మొదలు దిగువస్థాయి వరకు ఆరోగ్య ఔషధ విభాగాల్లోని లొసుగులను, వైఫల్యాలను, అవినీతిని ఎత్తి చూపుతూ లెంటిన్ తన నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. ఆ నివేదికలోని ప్రతిపాదనలను, సిఫారసులను ప్రభుత్వం పట్టించుకోలేదనే చెప్పవచ్చు.

ఈ నకిలీ మందుల వల్ల కలిగే దుష్ప్రభావాలు అటుంచి జబ్బు తగ్గకపోతే వైద్యుడి వైఫల్యమా? ఉపయోగించిన మందులు కారణమా? అర్థంకాక మళ్లీ మళ్లీ పరీక్షల మీద పరీక్షలు చేయిస్తూ

ఇతర మందులతో రోగులపై ప్రయోగాలు చేస్తున్నారు. దీంతో రోగి ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా కూడా కుప్పకూలిపోతున్నారు. అసలు వైద్య ఆరోగ్య విషయంలో ఒక నిర్దిష్టమైన విధానం, ప్రణాళిక లేకపోవడం వల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయి. పాలక పెద్దలకు ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్య విషయంలో సవతి తల్లి ప్రేమ చూపెడుతున్నదనే విమర్శలు ఏనాటి నుంచో వున్నాయి. మాటలు ఎంత గొప్పగా చెబుతున్నా నిధులు కేటాయింపుల విషయంలో మాత్రం న్యాయం చేయలేక పోతున్నది.

భారత్లో ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వ వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో (జిడిపి) కేవలం 1.3శాతమే. గ్రామాల్లో 14.1శాతం, పట్టణాల్లో 19.1శాతం ప్రజలకు మాత్రమే ఏదో ఒక ఆరోగ్య బీమా సదుపాయం వుందని జాతీయ సర్వే కార్యాలయం ఇటీవల ప్రకటించింది. ఇప్పటికీ ఆ సర్వే చెప్పిన లెక్కల ప్రకారం ప్రజలు తమ వైద్య ఖర్చులను దాదాపు అరవై మూడు శాతాన్ని సొంతం గానే భరిస్తున్నారు. అదే జపాన్లో 12.75 శాతం, న్యూజిలాండ్లో 12.91 శాతం, ఆస్ట్రేలియాలో 17.72 శాతం, అమెరికాలో అయితే కేవలం 10.1 శాతమేనని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. లండన్కు చెందిన బ్లూమ్బర్గ్ రూపొందించిన ప్రపంచ ఆరోగ్య సూచి 2019 ప్రకారం కొన్ని ఆగ్నేయాసియా దేశాలు భారత్ కంటే ఎంతో మెరుగ్గా ఉన్నాయి. 169 దేశాలలో భారత్ 120వ స్థానంలో ఉండగా శ్రీలంక 66, బంగ్లాదేశ్ 91, నేపాల్ 110 స్థానాల్లో ఉన్నాయి.

ప్రపంచ వ్యాధుల భారం (గ్లోబుల్డిసీజ్ బర్డన్) అధ్యయన నివేదికలో వెల్లడించిన విషయాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అంతెందుకు, మొన్న కరోనా విజృంభించిన తరుణంలో భారత్లో ఆరోగ్య వ్యవస్థ ఎంత అస్తవ్యస్థంగా, బలహీనంగా ఉందో బయట పడింది. మందులు, డాక్టర్లు అటుంచి కనీసం ఇన్ఫ్రాస్ట్రక్చర్ కూడా లేదనే విషయం వెలుగు చూసింది. రోగులకు వెంటిలేటర్లు, ఉన్న వెంటిలేటర్లకు యాభై, అరవై రెట్లు అధికంగా కావాలని వైద్య వర్గాలే అంచనా వేశాయి. చివరకు ప్రాణవాయువు అందించలేకపోవడంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. ఇక గ్రామాల్లో వచ్చీరాని వైద్యంతో డాక్టర్లుగా చెలామణి అవుతూ తోచిన మందులు ఇచ్చేవారు కూడా తక్కువ సంఖ్యలో లేరు. కనీసం మందుల పేర్లు కూడా రాయలేని వారు కూడా ఈ డాక్టర్ల జాబితాలో చేరిపోతున్నారు. చిన్న చిన్న ఆపరేషన్లు చేయడానికి కూడా వెనుకాడడంలేదు. అర్హత లేని వైద్యులు చేసే ఇలాంటి చికిత్సల్లో కొన్ని సందర్భాల్లో రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇక వ్యాధి నిర్ధారణ పరీక్షా కేంద్రాల వ్యవహారం మిథ్యగా తయారైంది. ఎలాంటి అనుమతులు పొందకుండా పరీక్షా కేంద్రాలు దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో నడుస్తున్నాయి. వీటిని క్రమబద్ధీకరణ చేసేందుకు నిర్దిష్టమైన చట్టం రూపకల్పనకు చేస్తున్న ప్రయత్నాలు దశాబ్దాల తరబడి పెండింగ్ పెట్టారు. వ్యాధిని సకాలంలో గుర్తించకపోతే జబ్బు ముదిరి ప్రాణాలను బలితీసుకుంటున్నాయనే విషయం అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత్లో అకాల మరణాలకు చాలావరకు సాంక్రమికేతర వ్యాధులే కారణమవుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలో వెల్లడించింది. ఈవిషయం దక్షిణాసియాలోనే ఇతర దేశాలతో పోలిస్తే భారత్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం సీజన్ మారిన తర్వాత వచ్చిన వ్యాధులు, డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, స్వైన్ఫ్లూ తదితర విషజ్వరాలు ప్రజారోగ్యంపై దాడిచేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల వీటి బారిన పడి ఆస్పత్రిపాలైనవారు ఎందరో ఉన్నారు. పాలకులు గత అనుభవాలతోనైనా పాఠాలు నేర్చుకొని ప్రజారోగ్యం ఎదుర్కోబోతున్న సవాళ్లకు అనుగుణంగా సమాయత్తం కావాలి.


## చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**




## ఆకలి రాజ్యం - అంతర్జాతీయ సూచికల్లో దిగజారిన స్థానం

2023 గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో భారతదేశం 125 దేశాలలో 111వ స్థానానికి పడిపోయింది. ఇండెక్స్‌లో దేశం 28.7 స్కోర్ మాత్రమే చేసింది. పొరుగు దేశాలతో పోలిస్తే పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక వరుసగా 102వ, 81వ, 69వ, 60వ ర్యాంక్‌లను సాధించి మెరుగ్గా ఉన్నాయి. గత సంవత్సరం, భారతదేశం 121 దేశాలలో 107వ స్థానంలో ఉండేది. ఇప్పుడు 111వ స్థానానికి పడిపోయింది. భారతదేశంలోని మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ ర్యాంకింగ్‌లను తప్పుపట్టింది. దేశంలోని నిజమైన స్థితిని ఇది ప్రతిబింబించడం లేదని విమర్శించింది. ఈ ఇండెక్సును తయారు చేసే పద్ధతి సరిగా లేదని చెప్పింది. కాని ఈ నివేదికను రూపొందించిన సంస్థలు, జర్మనీకి చెందిన NGO వెల్ట్ హంగర్ హిల్ఫ్, ఐర్లాండ్‌కు చెందిన NGO కన్సర్న్ వరల్డ్‌వైడ్ సంస్థలు ప్రతిష్ఠాత్మకమైనవి. భారతదేశంలో పిల్లల్లో చైల్డ్ వేస్టింగ్ రేటు 18.7 శాతం ఉందని ఈ నివేదిక పేర్కొంది. ఇది ప్రపంచంలో అత్యధికం, ఇది తీవ్రమైన పోషకాహార లోపాన్ని సూచిస్తుంది. పేదరికం ర్యాంకింగ్‌కు మెథడాలాజికల్ లోపాలను ఆపాదిస్తూ ప్రభుత్వం తిరస్కరిస్తూనే ఉంది, సమస్యను గుర్తించడానికి ప్రభుత్వం నిరాకరించడం ఆందోళనకరమైన అంశమని పలువురు అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆకలికి వ్యతిరేకంగా కార్యకలాపాల పురోగతి చాలా వరకు స్తబ్దుగా ఉందని నివేదిక ప్రకటించింది. ప్రపంచ ఆహార కార్యక్రమం అధిపతి ఈ విషయమై మాట్లాడుతూ ప్రపంచం దీర్ఘకాలిక సంక్షోభాలను ఎదుర్కొంటుందని హెచ్చరించారు.

## ముస్లిం వ్యాపారుల బహిష్కరణ వీహెచ్‌పీ పిలుపు - నోరు విప్పని వహించిన మోడీ ప్రభుత్వం

మంగళూరులో ముస్లిం వ్యాపారులను బహిష్కరించాలని విశ్వహిందూ పరిషత్ చీఫ్ అలోక్ కుమార్ చేసిన ప్రకటన ఇటీవల సంచలనం రేకెత్తించింది. ఈ సంఘటన అక్టోబర్ 10, 2023న జరిగింది. హిందుస్థాన్ టైమ్స్‌తో సహా అనేక పత్రికల్లో వచ్చింది. కుమార్ ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. భారతీయ శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్ల కింద అతనిపై కేసు నమోదు చేయబడింది. ఈ కేసులు విచారణకు ఎప్పుడు వస్తాయో, శిక్ష పడుతుందో లేదో ఎవరికీ తెలియదు. ఎందుకంటే, ఇలాంటి వ్యాఖ్యలు చేసిన చాలా మందికి ఇప్పటి వరకు శిక్షలు పడిన దాఖలా లేదు. భయంకరమైన విషయం ఏమిటంటే, ఈ విద్వేషానికి నిశ్శబ్ద మద్దతు మోడీ ప్రభుత్వం నుండి లభిస్తోంది. కొన్నేళ్లుగా అధికార పార్టీ నేతలు, దాని అనుబంధ సంఘాల సభ్యులు మైనారిటీ వర్గాలను లక్ష్యంగా చేసుకుని విద్వేష ప్రకటనలు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇటువంటి సంఘటనలు గణనీయంగా పెరిగాయి. ప్రభుత్వ నిష్క్రియాపరత్వం సమస్యను మరింత పెంచింది. ముస్లిం వ్యాపారుల బహిష్కరణ పిలుపు కేవలం సమాజంపై దాడి మాత్రమే కాదు, ఇది లౌకికవాదాన్ని, సమైక్యతా సూత్రాలను కూడా బలహీనపరుస్తుంది. సామాజిక సామరస్యానికి భంగం కలిగిస్తుంది. సమాజంలో హింసను రెచ్చగొడుతుంది. ఆర్థిక మాంద్యం, సామాజిక అశాంతితో సహా అనేక సవాళ్లతో పోరాడుతున్న సమయంలో ఇలాంటి పిలుపులు దేశానికి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయి. ఇటువంటి ద్వేషపూరిత ప్రసంగాలను ఖండించడంలో, దోషులపై కఠిన చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వ నిరాసక్తత బీజేపీ ప్రాధాన్యతలకు స్పష్టమైన ఉదాహరణ. భారతదేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నాయో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

## అసలు రంగు చూపిస్తున్న బీజేపీ - ప్రవక్త ముహమ్మద్ (స)పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజాసింగ్ సస్పెన్షన్ ఎత్తివేత

గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజా సింగ్‌పై సస్పెన్షన్‌ను భారతీయ జనతా పార్టీ ఉపసంహరించుకుంది. నవంబర్ 30 న జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం అతనికి మళ్లీ అదే సీటును కేటాయించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. రాజాసింగ్‌పై 100కి పైగా కేసులు నమోదై ఉన్నాయి. ఇవన్నీ చాలా వరకు మతపరమైన నేరాలకు సంబంధించినవి. ప్రవక్త ముహమ్మద్(స)పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గత సంవత్సరం బిజెపి రాజాసింగ్‌ను సస్పెండ్ చేయక తప్పలేదు. రాజా సింగ్ సస్పెన్షన్‌లో ఉన్నందున, కొన్నేళ్ల క్రితం కాంగ్రెస్‌ను విడిచిపెట్టి కాషాయ పార్టీలో చేరిన బిజెపి నాయకుడు ఎం విక్రమ్ గౌడ్ గోషామహల్ స్థానం నుంచి పోటీ చేయాలని భావించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలలో రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా పనిచేసిన విక్రమ్ తండ్రి ముఖేష్ గౌడ్, ఆయన 2014 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో రాజా సింగ్‌పై పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు విక్రం గౌడ్ ఆశలు అడియాసలయ్యాయి. తెలంగాణ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై ప్రస్తుతం రాజాసింగ్ జైలు నుంచి బయట ఉన్నాడు.

## ప్రపంచవ్యాప్తంగా పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు

ఇస్రాయీల్, గాజాల మధ్య ఒకవైపు భీకర యుద్ధం కొనసాగుతోంది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా వివిధ నగరాల్లో పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు జరిగాయి. పాలస్తీనా ప్రజలకు న్యాయం జరగాలన్న నినాదాలు మిన్నంటాయి. వివిధ దేశాల్లో లక్షలాది ప్రదర్శనలు నిర్వహించారు. గాజాపై ఇస్రాయీల్ వైమానిక దాడులు తీవ్రం చేసిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఇస్రాయీల్ వ్యతిరేక స్వరాలు పెరిగాయి. పాలస్తీనా పట్ల సానుభూతి ఇప్పుడు వ్యవస్థీకృతమైన మద్దతుగా మారింది. పాలస్తీనాకు బాసటగా నిలబడండి అనే నినాదం బిగ్గరగా వినిపిస్తోంది. స్థానిక పాలస్తీనా ప్రజల హక్కులను గుర్తిస్తూ, ఇస్రాయీల్ దురాక్రమణను నిరసిస్తూ ప్రజలు ఉద్యమిస్తున్నారు. దాదాపు 75 సంవత్సరాలుగా ఇస్రాయీల్ కొనసాగిస్తున్న దురాక్రమణ, హింసాకాండలను ప్రపంచ ప్రజలు ఇప్పుడు మరింత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అక్టోబర్ 7వ తేదీన ఇస్రాయీల్ పై హమాస్ దాడి తర్వాత చోటు చేసుకున్న సంఘటనలు పాలస్తీనా పట్ల సంఘీభావాన్ని పెంచాయి. జోర్డన్‌లో శుక్రవారం రోజున వేలాది మంది ప్రజలు నిరసనలకు దిగారు. వెస్ట్ బ్యాంకు లోని ఇస్రాయీల్ సరిహద్దు వద్ద నిరసన మార్చ్ నిర్వహించారు. కాని వారిని జోర్డన్ పోలీసులు అడ్డుకున్నారు. అంతర్జాతీయంగా వివిధ దేశాల్లో ఇస్రాయీల్ పట్ల పెరుగుతున్న అసహనానికి జోర్డన్ ప్రదర్శన ఒక ఉదాహరణ. కేవలం అరబ్బు దేశాల్లో మాత్రమే కాదు, ఫ్రాన్సులోని పారిస్ లో కూడ ప్రజలు పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు చేశారు. పాలస్తీనా అనుకూల ర్యాలీని అక్కడి పోలీసులు అడ్డుకున్నారు. నిషేధాజ్ఞలున్నప్పటికీ ప్రదర్శనకారులు టియర్ గ్యాస్, వాటర్ కేనన్లను కూడా లెక్కచేయకుండా ప్రదర్శనలో పాల్గొన్నారు. యూరపులో పాలస్తీనా పట్ల సంఘీభావం ఎంత బలంగా ఉందో దీన్ని బట్టి తెలుస్తోంది. అమెరికాలో కూడా పాలస్తీనాకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. న్యూయార్కు నగరంలో అక్టోబర్ 8వ తేదీన పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు భారీగా జరిగాయి. ఈ ప్రదర్శనలు ప్రపంచ వ్యాప్తంగా పాలస్తీనాకు లభిస్తున్న మద్దతుకు ఉదాహరణలు. పాలస్తీనాకు న్యాయం జరగాలని ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో ఉన్న ఆకాంక్షలకు నిదర్శనాలు. ఇస్రాయీల్ పాలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించాలని, పాలస్తీనాకు న్యాయం జరగాలన్న స్వరాలు ఇప్పుడు మరింత బిగ్గరగా వినిపిస్తున్నాయి. గాజాపై ఇస్రాయీల్ దాడుల్లో మృతుల సంఖ్య పెరుగుతున్న కొద్ది ఆందోళనలు మరింత పెరుగుతున్నాయి.




## ఆర్థిక ప్రగతి పథంపై సౌదీ అరేబియా

సౌదీ అరేబియా ఇప్పుడు ఆర్థికప్రగతిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. గోల్డ్ మ్యాన్ సాచ్స్ నివేదిక ఈ వివరాలను అక్టోబర్ 13వ తేదీన విడుదల చేసింది. 2021లో సౌదీ జాతీయ మదుపు వ్యూహాన్ని ప్రవేశపెట్టింది. ఆరు ప్రత్యేక రంగాల్లో దాదాపు ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఈ దశాబ్దం ముగిసేనాటికి అభివృద్ధి పథంపై ముందుకు సాగాలన్న వ్యూహం ప్రవేశపెట్టింది. సౌదీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక 3.3 ట్రిలియన్ డాలర్ల ప్రణాళిక. 2030 నాటికి 870 బిలియన్ డాలర్ల మెగా ప్రాజెక్టులు పూర్తి చేయాలనుకుంటోంది. ఇందులో నియోమ్ సిటీ ప్రాజెక్టు కూడా ఉంది. అకబా గల్ఫ్ ప్రాంతంలో నియోమ్ నగరం అత్యాధునిక నగరంగా ఉనికిలోకి రాబోతోంది. 2030 నాటికి సౌదీ 60 గిగా వాట్ల రిన్యూవబుల్ ఎనర్జీ ప్రణాళికలు, దాదాపు 3 గిగావాట్ల అణు విద్యుత్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. దీనికి దాదాపు 206 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోంది. 2021లో సౌదీ కొత్త గనుల చట్టాన్ని తీసుకువచ్చింది. దాదాపు 1.3 ట్రిలియన్ డాలర్ల విలువైన లోహఖనిజాలను తవ్వితీసే ఈ ప్రాజెక్టు వ్యయం 170 బిలియన్ డాలర్లు. రవాణా, నౌకాయాన రంగాల్లో సౌదీ ప్రపంచానికి కేంద్రంగా మారాలనుకుంటోంది. కింగ్ సల్మాన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మరింత విస్తరిస్తున్నారు. ఈ మొత్తం ప్రణాళిక వ్యయం 150 బిలియన్ డాలర్లు. డిజిటల్ రంగంలోను నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచడానికి, ప్రత్యేకంగా 5జి, ఫైబర్ టు హోం సాంకేతికతను మరింత విస్తరిస్తున్నారు. ఈ ప్రణాళిక వ్యయం 147 బిలియన్ డాలర్లు. సౌదీలో సాంప్రదాయిక శక్తి వనరులు ఇప్పటికి కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ శక్తి వనరుల కోసం 345 బిలియన్ డాలర్లు కేటాయించారు. సౌదీలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2025 నాటికి 3.4 శాతం పెరగవచ్చని అంచనా. 2030 నాటికి 5.7 శాతానికి చేరుకోవచ్చు. 2030 నాటికి షరీక్ ప్రోగ్రామ్ క్రింద భాగస్వామ్య డొమెస్టిక్ పెట్టుబడులు 1.3 ట్రిలియన్ డాలర్లకు పెంచుతున్నారు. ప్రారంభ లక్ష్యాలను సాధించిన తర్వాత మరిన్ని ప్రకటనలు సౌదీ నుంచి రావచ్చని గోల్డ్ మ్యాన్ సాచ్స్ పరిశోధకుడు అల్ ఆజ్మీ ప్రకటించారు. వివిధ రంగాల్లో సాంకేతిక ఆవిష్కరణలు కూడా ముందుకు రావచ్చు. సౌదీ అరేబియా ఆర్థికవ్యవస్థను వివిధ రంగాలకు విస్తరించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ ప్రయత్నాలను చాలా మంది కొనియాడుతున్నారు. 2016లో సౌదీ విజన్ 2030 ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి సౌదీ ఆర్థికంగా కొత్తమలుపు తీసుకుంది.

# పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ఖండించిన నంద్యాల జిల్లా ముస్లిం రచయితల సంఘం




నంద్యాల జిల్లా ముస్లిం రచయితల సంఘం (మురసం) సమావేశం చాంద్ బాడాలోని క్రాంతి రేఖ గ్రంథాలయంలో మురసం ఆం.ప్ర రాష్ట్ర ఉపాధ్యక్షులు, రచయిత షేక్ అబ్దుల్ సమద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సమద్ ముస్లిం రచయితల సంఘం పరిచయం చేస్తూ మురసం అన్ని మతాలకు, కులాలకు, సంస్కృతులకు ప్రాతినిధ్యం వహించే నిజమైన సెక్యులర్ రాజ్యం, సామాజిక, ఆర్థిక సమానత్వం కోరుకుంటుందని తెలిపారు. మహిళల హక్కుల కోసం మురసం మాట్లాడటమే కాదు తన వేదికలపై మహిళా ప్రాతినిధ్యం ఇస్తుందన్నారు. జిల్లా కార్యవర్గం పదవి కాలం రెండేళ్ళు ఉంటుందని, మురసం సభ్యులు భారత రాజ్యాంగ విలువలకు, లౌకిక ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి ఉంటారని సమద్ వివరించారు. మురసం సభ్యులు ఇస్లామియా విశ్వాసాలు గౌరవిస్తూనే ఇతర మతాలను, కులాలను దూషించరని స్పష్టం చేసారు. ముస్లిం రచయితల సంఘం ఏ మతానికి, కులానికి వ్యతిరేకం కాదని, సెక్యులర్, సోషలిస్టు, దళిత, బహుజన సాహితీవేత్తలకు వేదికలపై వ్యక్తులుగా ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రమజాన్‌లో కవి సమ్మేళనం, సంకలనాలు, అబాబీల్, కథలు, వ్యాస రచన ప్రక్రియలు నిర్వహిస్తుందన్నారు. 2023-25 ద్వివార్షికానికి మురసం నంద్యాల జిల్లా ఈ క్రింది కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**గౌరవ సాహితి సలహాదారు:** ఎస్.ముర్తుజా విద్వాన్, బిఎ

**అధ్యక్షులు:** యం.యండి.రఫీ ఎ.ఎస్సి, యం.ఎడి, లెక్చరర్‌లి

**ఉపాధ్యక్షులు:** 1) ఎస్.యండి కరీముద్దీన్ 2) అబ్దుల్ ఆజాద్ ఖాన్

**ప్రధాన కార్యదర్శి:** షేక్ మహబూబ్ బాషా బి.ఎ, బీ.ఎడ్, తెలుగు ఉపాధ్యాయులు

**సహాయ కార్యదర్శి:** యం.యండి.రఫీ,ఎం.ఎ.బి.ఎడి టీచర్

**కోశాధికారి:** ఎస్.యండి.ఫయాజ్, ఎం.ఏడ్


**కార్యవర్గం సభ్యులు**

1) అబ్దుల్ వహాబ్ 2) పి.అయూబ్ ఖాన్ 3) అబ్దుల్ అలీం 4) సి.అబ్దుల్ అజీజ్ 5) సయ్యద్ జమీలుద్దీన్ 6) అమ్జద్ షరీఫ్ 7) ముహమ్మద్ సాజిద్ 8) యం.యం.డి సైఫుల్లా 9) అబ్దుల్ మునీర్.

**పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ఖండిస్తూ ఏకగ్రీవ తీర్మాణం**

అనంతరం సభ్యులు పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ఖండిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇజ్రాయిల్ రాజ్యం కాంక్షతో మానవత్వాన్ని మరిచి చిన్న పిల్లలను సైతం పొట్టన పెట్టుకుంటుందని ప్రపంచ జనావళి ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని పిలుపునిచ్చింది.

**తుదిగీటు**



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**